thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 140| జగిత్యాల | శనివారం 22 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ట్రెడ్ మిల్ పై యాష్లే ప్రపంచ రికార్డు




11

## చక్కెర ధరలపై కేంద్రం వివరణ

- బీహార్ మంత్రి వింత వ్యాఖ్యలు
- ఇథనాల్ ఉత్పత్తితో ధరలకు సంబంధం లేదన్న కేంద్రం
- డయాబెటిస్ వల్ల పంచదార వినియోగం తగ్గిందన్న బీహార్ మంత్రి శ్రావణ్ కుమార్

4




## జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే

- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- సివిల్ జడ్జి పోస్టులకు మూడేళ్ల అనుభవ నిబంధన సవరణ
- 2027 మార్చి వరకు లా గ్రాడ్యుయేట్లకు అనుభవంతో సంబంధం లేకుండా మినహాయింపు

4






## ఆక్స్‌ఫర్డ్‌లో సీఎం రేవంత్

- 900 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీ సందర్శన
- బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పర్యటన
- ప్రముఖ ప్రొఫెసర్లతో తెలంగాణ బృందం భేటీ
- ఆక్స్‌ఫర్డ్‌తో భారత్ అనుబంధంపై చర్చ

2

## రాయదుర్గం భూముల వేలానికి లైన్ క్లియర్

- జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచన
- 11 ఎకరాల వేలానికి తొలగిన అడ్డంకి
- ఎకరాకు కనీస ధర రూ.175 కోట్లు

2



2

**ఎకరం 264 కోట్లు**

# ఎల్‌నినోను ఎదుర్కొందాం.. రైతును నిలబెడదాం

- అక్టోబర్, నవంబర్ అత్యంత కీలకం
- పంట చేతికొచ్చే వేళ నీటి కొరత రానివ్వొద్దు
- భూగర్భ జలాల వినియోగంపై పక్కా ప్రణాళిక
- 44 వేల చెరువుల్లో నీటి నిల్వకు చర్యలు
- అన్ని శాఖల సమన్వయంతో రైతుకు భరోసా
- వర్క్‌షాప్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి



ఎల్‌నినో ప్రభావంతో రాబోయే వర్షాభావ పరిస్థితులను, నీటి ఎద్దడిని ముందస్తుగా గుర్తించి రాష్ట్ర రైతాంగాన్ని అన్ని విధాలా సన్నద్ధం చేయాలని పలువురు రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో అనేది సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే కీలక సమయంలో నీటి కొరత తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీజీఐఆర్డీ) వేదికగా 'ఎల్‌నినో ఎదుర్కొనేందుకు సమగ్ర సమీకృత వ్యవసాయ కుంటల పాత్ర' అనే అంశంపై శుక్రవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

*- హైదరాబాద్, ఆగస్టు 21*



## చెప్పాల్సింది చెప్పేశా..

సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక స్పందిస్తా

3

కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతమేనన్న కొండా సురేఖ



## ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు

- హైకోర్టులో ముగిసిన వాదనలు
- సెప్టెంబర్ 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు

2

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది.



## పెల్లెట్ బాధితుడి కోసం రాహుల్ భైఠాయింపు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ డిమాండ్
- బాధితుడు సాహిల్‌తో ఠాణాకు రాహుల్
- కేసు నమోదుకు పోలీసులు నిరాకరించారంటూ నిరసన

4



## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

- అందుకే సీఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ

2

## ప్రపంచ పెట్టుబడులే లక్ష్యం..

- తెలంగాణ రైజింగ్‌కు భారీ సన్నాహాలు
- డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్
- తెలంగాణ సామర్థ్యాన్ని చాటే రంగాల వారీగా ప్రదర్శనలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశం

2



## రాష్ట్రంలో ఇల్లు లేని పేద ఉండొద్దు



3

- అసంపూర్తి గృహాలనూ పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తాం
- నూకలపల్లి 5,400 ఇళ్లకు రూ.32 కోట్లతో మౌలిక వసతులు
- కాలనీకి పాఠశాల, ఆసుపత్రి, చర్చి, మసీదు మంజూరుకు హామీ
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు: మంత్రి పొంగులేటి



## కల్తీకల్లు మాఫియాపై ఉక్కుపాదం

- మూడు రాష్ట్రాలకు విస్తరించిన ఆల్ప్రాజోలం దందా గుట్టురట్టు
- రూ.6 కోట్ల విలువైన అక్రమ ఆస్తుల జప్తు
- 15 మంది కీలక నిందితులు అదుపులో..

3

## ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

రిటర్న్ టికెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ




2

ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేకమైన ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. రిటర్న్ టికెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ కల్పించింది.



# ఆక్స్‌ఫర్డ్‌లో సీఎం రేవంత్

**900 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీ సందర్శన**

**బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పర్యటన**

**ప్రముఖ ప్రొఫెసర్లతో తెలంగాణ బృందం భేటీ**

**బ్రిటన్, ఆగస్టు 21:** లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచంలోని అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర ప్రతినిధి బృందంతో కలిసి విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించారు. పాలన, ప్రజా విధానాలపై అధ్యయనం, పరిశోధనలకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఈ విద్యాసంస్థలోని అధ్యాపకులతో తెలంగాణ ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ బృందాన్ని కలుసుకున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పర్యటించిన సందర్భంగా ఆక్స్‌ఫర్డ్‌కు భారతదేశంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. దాదాపు తొమ్మిది శతాబ్దాల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సీఎం సందర్శించడం ఆయన బ్రిటన్ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళలకు సీఎం శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్ట్ 21:** మంగళకరమైన శ్రావణ శుక్రవారం, సకల సౌభాగ్యాలను ప్రసాదించే శ్రీ వరలక్ష్మీ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించే శుభదినం సందర్భంగా సీఎందరేవంత్ రెడ్డి ప్రజలందరికీ శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీవరలక్ష్మీ దేవి అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

**సావుకారు జానకికి సెం రేవంత్ సంతాపం**

ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి గారు దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు సీఎం సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు

**16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు**

**హైదరాబాద్, ఆగస్ట్ 21:** తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఎబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

**రిటర్న్ టికెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ**

**హైదరాబాద్, ఆగస్ట్ 21:** ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. రాకపోకల టికెట్లను ఒకేసారి ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు తిరుగు ప్రయాణ టికెట్‌పై 10 శాతం రాయితీ కల్పిస్తోంది. ప్రయాణ ఖర్చును తగ్గించడంతో పాటు ముందస్తు రిజర్వేషన్లను ప్రోత్సహించేందుకు ఈ అవకాశం కల్పించినట్లు సంస్థ తెలిపింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు వారాంతాలు, పండుగలు, సెలవుల్లో కుటుంబాలతో ప్రయాణించే వారికి ఈ రాయితీ ప్రయోజనకరంగా ఉండనుంది. వెళ్లే ప్రయాణంతోపాటు తిరుగు ప్రయాణానికి కూడా ఒకేసారి టికెట్లు రిజర్వేషన్ చేసుకున్నప్పుడే 10 శాతం రాయితీ వర్తిస్తుంది. ప్రయాణికులు ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ప్రయాణ తేదీలను ముందుగానే ఖరారు చేసుకునే వారికి రాయితీతో పాటు కోరుకున్న బస్సులో సీటు పొందే అవకాశం కూడా ఉంటుందని సంస్థ పేర్కొంది. రాబోయే పండుగలు, సెలవుల సీజన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందుగానే రాకపోకల టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది. దీనివల్ల సీట్ల లభ్యతపై ఆందోళన తగ్గడంతో పాటు తిరుగు ప్రయాణ ఛార్జీలో 10 శాతం ఆదా చేసుకోవచ్చని తెలిపింది. టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన సందేహాలు, ఇతర సమాచారం కోసం 040-69440000, 040-23450033 నంబర్లను సంప్రదించవచ్చని ఆర్టీసీ తెలిపింది. సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలను వినియోగించుకోవడంతో పాటు రిటర్న్ టికెట్ రాయితీని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

# ఎల్‌నినోను ఎదుర్కొందాం.. రైతును నిలబెడదాం

- సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి
- అక్టోబర్, నవంబర్ అత్యంత కీలకం
- పంట చేతికొచ్చే వేళ నీటి కొరత రానివ్వొద్దు
- భూగర్భ జలాల వినియోగంపై పక్కా ప్రణాళిక
- 44 వేల చెరువుల్లో నీటి నిల్వకు చర్యలు
- అన్ని శాఖల సమన్వయంతో రైతుకు భరోసా
- వర్క్‌షాప్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఆగస్టు 21:** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి తెలంగాణను అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినోను సాధారణ పరిస్థితిగా తీసుకోవద్దని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగిస్తూ రైతాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్‌లో శుక్రవారం ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు గణనీయంగా పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని తుమ్మల పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి, వాటిని పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చూడాలన్నారు.

**44 వేల చెరువులే ఆయుధం**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 44 వేల చెరువులను సమర్థంగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. వర్షపు నీరు చెరువుల్లోకి చేరే మార్గాలను పునరుద్ధరించి సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలన్నారు. చెరువుల్లో నీరు నిలిస్తే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగి బోర్లకు నీరు అందే అవకాశం ఉంటుందని వివరించారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేసి నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రతి గ్రామానికి 'నీటి బడ్జెట్'**

జిల్లా స్థాయిలో అధికారులు నిరంతరం సమన్వయ సమావేశాలు నిర్వహించి ఆయా ప్రాంతాల్లో నీటి లభ్యత, పంటల పరిస్థితిపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని తుమ్మల ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలన్నారు. ప్రజలతో అధికారులు మానవీయ కోణంలో వ్యవహరించాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి రైతులను బయటకు తీసుకురావాలని మంత్రి పేర్కొన్నారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులకు గురైనా రైతుకు నష్టం తగ్గించవచ్చన్నారు. ఉద్యాన పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని, ఆయిల్‌పామ్‌లో కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కల్పించవచ్చని చెప్పారు.

**పశువులు.. వన్యప్రాణులకూ నీరు**

కరువు పరిస్థితులు ఎదురైతే మనుషులతో పాటు పశువులు, వన్యప్రాణులకు కూడా నీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. గతంలో కరువు సమయంలో గ్రామాల వెలుపల పశువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసిన విధంగానే అవసరమైతే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు నీటి సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలను కేవలం సవాళ్లుగా చూడకుండా అవకాశాలుగా మార్చుకోవాలని తుమ్మల పిలుపునిచ్చారు. కొత్త సాంకేతికత కోసమే ఎదురుచూడకుండా పూర్వీకులు అనుసరించిన సంప్రదాయ నీటి సంరక్షణ పద్ధతులను కూడా తిరిగి అమల్లోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలు సమష్టిగా పనిచేస్తే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. "ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతును నిలబెట్టగలిగే శక్తి మనకు ఉండాలి. ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్.. ప్రతి రైతుకు నీటి భద్రత.. ప్రతి ఎకరానికి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగాలి" అని తుమ్మల పిలుపునిచ్చారు.

# రాయదుర్గం భూముల వేలానికి లైన్ క్లియర్

- జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచన
- 11 ఎకరాల వేలానికి తొలగిన అడ్డంకి
- ఎకరాకు కనీస ధర రూ.175 కోట్లు



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం ప్రక్రియకు ఉన్న న్యాయపరమైన అడ్డంకి తొలగింది. టీజీఐఐసీ చేపట్టిన భూముల వేలంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వేలం ప్రక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ మోహన్ ఉన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలాన్ని కొనసాగించేందుకు టీజీఐఐసీకి మార్గం సుగమమైంది. రాయదుర్గం పాన్‌మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న సుమారు 11 ఎకరాల భూముల విక్రయానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో ఎకరానికి రూ.175 కోట్ల కనీస ధరను నిర్ణయించింది. ఈ వేలాన్ని సవాలు చేస్తూ ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, రక్షించాల్సిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. కంచ గచ్చిబౌలి భూములకు, ప్రస్తుతం వేలం వేస్తున్న రాయదుర్గం పాన్‌మక్తా భూములకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. రెండు ప్రాంతాలు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు టీజీఐఐసీ వేలం నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఈ వ్యవహారంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో కోట్లాది రూపాయల విలువైన రాయదుర్గం భూముల వేలానికి కీలక న్యాయపరమైన అడ్డంకి తొలగినట్లయింది.

## ఎకరం 264 కోట్లు

**రాయదుర్గం భూములకు రికార్డు ధర**

**హైదరాబాబాద్, ఆగస్ట్ 21:** నగరంలోని రాయదుర్గంలో ఎకరం భూమి రికార్డు ధర పలికింది. పాన్‌మక్తాలో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎకరా రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది. మొత్తం 5.25 ఎకరాలనూ ఆ సంస్థే దక్కించుకుంది. ఇదే సర్వే నంబర్‌లో మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. వేలంలో కనీస ధర రూ.175 కోట్లు, డిపాజిట్ రూ.10కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించింది. బిడ్డర్లు డిపాజిట్ చెల్లించి ఆన్‌లైన్ వేలంలో పాల్గొన్నారు. ఖరీదైన భూమి కావడంతో స్థిరాస్తి సంస్థలు పోటీపడి బిడ్డింగ్ దాఖలు చేశాయి. చివరికి ఎంఎస్ఎన్ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని దక్కించుకుంది.

# రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

**అందుకే సీఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# చక్కెర ధరల పెరుగుదలపై కేంద్రం వివరణ

**ఇథనాల్ ఉత్పత్తితో ధరలకు సంబంధం లేదన్న కేంద్రం**

**న్యూఢిల్లీ:** దేశంలో ఇటీవల చక్కెర ధరలు పెరగడంపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ స్పందించింది. పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ తయారీకి చక్కెరను మళ్లించడం వల్లే ధరలు పెరిగాయన్న విపక్షాల ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. స్థానికంగా అంచనాల కంటే తక్కువ దిగుబడి రావడం, పండుగల డిమాండ్, అంతర్జాతీయ సరఫరాల్లో అంతరాయం, కొంతమంది నిల్వలు పెంచడం వల్లే ధరలు పెరిగాయని స్పష్టం చేసింది. 2022-23లో ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా 12 శాతంగా ఉండగా, 2025-26 నాటికి అది 9 శాతానికి తగ్గిందని, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో ఎక్కువ భాగం మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచే వస్తోందని తెలిపింది. జులై 20న కిలో రూ.48.18గా ఉన్న ధర, ఆగస్టు 20 నాటికి రూ.55.70కి చేరడంతో నిల్వలపై పరిమితులు విధించడంతో పాటు దిగుమతి సుంకాలు తగ్గించినట్లు పేర్కొంది. మరోవైపు చక్కెర ధరల పెరుగుదలపై బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రావణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. నేటిరోజుల్లో అందరికీ డయాబెటిస్, ప్రీ-డయాబెటిక్ సమస్యలు ఉన్నాయని, ప్రజలు తీపి పదార్థాలను సరిగా తినడం లేదు కాబట్టి చక్కెర ధర పెరిగినా ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లతో పాటు ప్రతిపక్ష ఆర్జేడీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఉదయాన్నే కప్పు టీతో దినచర్య ప్రారంభించే సామాన్య ప్రజలపై ఈ ధరల భారం తీవ్రంగా పడిందని, మంత్రి హోదాలో ఉన్న శ్రావణ్ కుమార్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సరికాదని ఆర్జేడీ ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ విమర్శించారు.

# ప్రపంచ పెట్టుబడులే లక్ష్యం..

- తెలంగాణ రైజింగ్‌కు భారీ సన్నాహాలు
- డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్' గ్లోబల్ సమ్మిట్
- విదేశీ రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు
- ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులపై దృష్టి
- తెలంగాణ సామర్థ్యాన్ని చాటే రంగాల వారీగా ప్రదర్శనలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 21:** ప్రపంచ పెట్టుబడులను తెలంగాణ వైపు ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు భారీ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్‌లో హైదరాబాద్ వేదికగా జరిగే ఈ అంతర్జాతీయ సదస్సును అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సంజయ్ జాజు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక సంస్థలు, వివిధ రంగాల ప్రముఖులతో పాటు నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని సీఎస్ సూచించారు. ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులను సమ్మిట్‌కు రప్పించేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలన్నారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో పాటు శాస్త్రసాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాలకు చెందిన ప్రముఖులను భాగస్వాములను చేయాలని సూచించారు.

## తెలంగాణ సత్తా ప్రపంచానికి చాటాలి

పరిశ్రమలు, సమాచార సాంకేతికత, జీవశాస్త్రాలు, వైద్యం, విద్య, మౌలిక వసతులు సహా తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సంజయ్ జాజు ఆదేశించారు. ఆయా ప్రదర్శనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

## ప్రత్యేక కమిటీలతో పర్యవేక్షణ

సమ్మిట్ నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూడాలన్నారు. ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమ్మిట్‌కు మార్గదర్శకత్వం అందించేందుకు పరిశ్రమలు, పెట్టుబడులు, సాంకేతికత తదితర రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింత బలంగా ఆవిష్కరించే వేదికగా ఈ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్‌రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# చెప్పాల్సింది చెప్పేశా..

## షోకాజ్‌పై క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చా
## సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక స్పందిస్తా
## కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతమేనన్న కొండా సురేఖ

**హైదరాబాద్, ఆగస్టు 21:** కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసుపై తాను చెప్పాల్సిందంతా చెప్పేశానని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం కొత్తగా చెప్పాల్సిందేమీ లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత మాట్లాడతానని వెల్లడించారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పాను. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. ఈ అంశంపై ప్రస్తుతం మీడియాతో మాట్లాడను. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను" అని కొండా సురేఖ పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నోటీసులపై ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు కొండా సురేఖ లిఖితపూర్వక వివరణ పంపారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని అందులో స్పష్టం చేశారు. కుమార్తె చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలకు తనను రాజకీయంగా బాధ్యురాలిని చేయడం సముచితం కాదని పేర్కొంటూ తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. మరోవైపు సుస్మిత వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కుమార్తె చేసిన విమర్శలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. షోకాజ్ నోటీసుతోనే వ్యవహారాన్ని ముగిస్తారా? లేక క్రమశిక్షణ చర్యల దిశగా ముందుకెళ్తారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# కల్తీకల్లు మాఫియాపై ఉక్కుపాదం

- మూడు రాష్ట్రాలకు విస్తరించిన ఆల్ప్రాజోలం దందా గుట్టురట్టు
- రూ.6 కోట్ల విలువైన అక్రమ ఆస్తుల జప్తు
- 32.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం
- మహారాష్ట్రలో కెమికల్ ఫ్యాక్టరీపై మెరుపుదాడి
- 15 మంది కీలక నిందితులు అదుపులో



**హైదరాబాద్, ఆగస్టు 21:** తెలంగాణలో కల్తీకల్లు తయారీకి ఆల్ప్రాజోలం సరఫరా చేస్తున్న భారీ అంతర్రాష్ట్ర ముఠాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్, బోధన్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు విస్తరించిన నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు అక్రమ వ్యాపారంతో కూడబెట్టిన సుమారు రూ.6 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 15 మంది కీలక నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మాదకద్రవ్యాల వ్యాపారం ద్వారా వచ్చిన సొమ్ముతో సమకూర్చుకున్న ఆస్తులపై ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 68(ఈ) ప్రకారం అధికారులు చర్యలు చేపట్టారు. నిందితులకు చెందిన 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల ప్లాట్లు, అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలతో పాటు మహారాష్ట్రలోని కెమికల్ ఫ్యాక్టరీని జప్తు చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వీటి విలువ రూ.2.5 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

## కల్తీకల్లు ఘటనలతో కదిలిన డొంక

ఉమ్మడి నిజామాబాద్, మెదక్, సిద్ధిపేట జిల్లాల్లో కల్తీకల్లు తయారీకి ఆల్ప్రాజోలం వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నస్రుల్లాబాద్‌లో కల్తీకల్లు తాగి 68 మంది, గాంధారి ప్రాంతంలో మరో 15మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పోలీసులు నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. సిద్ధిపేటలో కల్తీకల్లుకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయి. జహీరాబాద్‌లో నిఘా పెట్టిన అధికారులు 750గ్రాముల ఆల్ప్రాజోలం, 7.50లక్షల నగదు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో లభించిన ఆధారాలతో దర్యాప్తును మరింత విస్తరించారు.

## బోధన్‌లో దొరికిన తీగ.. మహారాష్ట్రలో కదిలిన డొంక

బోధన్ పరిధిలో నిర్వహించిన మెరుపుదాడిలో రూ.25 లక్షల విలువైన 2.5 కిలోల ఆల్ప్రాజోలం, ఒక కారు, రూ.25 లక్షల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ లభించిన కీలక ఆధారాలతో దర్యాప్తు బృందాలు మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చేరుకున్నాయి. అక్కడి 'సూర్యప్రభ ఫార్మా కెమ్' ఫ్యాక్టరీపై దాడి చేసి అక్రమంగా తయారు చేస్తున్న 30 కిలోల ఆల్ప్రాజోలంతో పాటు రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.4 కోట్ల విలువైన కెమికల్ ఫ్యాక్టరీని కూడా అధికారులు జప్తు చేశారు. మొత్తం ఆపరేషన్‌లో 32.5 కిలోల ఆల్ప్రాజోలం పట్టుబడినట్లు వెల్లడించారు.

## ఆస్తులూ వదలం!

మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంతో సంపాదించిన సొమ్ముతో ఆస్తులు కూడబెట్టేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఈగల్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. అక్రమ దందాలో ఎంతటి వారున్నా చట్టం ముందు నిలబెడతామని, డ్రగ్స్ సొమ్ముతో సమకూర్చుకున్న ఆస్తులను గుర్తించి జప్తు చేస్తామని స్పష్టం చేశారు.

# తానెక్కడా కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

## మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ

**యాదాద్రిభువనగిరి, ఆగస్ట్ 21:** కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తానుచేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

## ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి : మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 21:** ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సి ఉందని సూచించారు.

# రాష్ట్రంలో ఇల్లు లేని పేద ఉండొద్దు

- అసంపూర్తి గృహాలనూ పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తాం
- నూకలపల్లి 5,400 ఇళ్లకు రూ.32 కోట్లతో మౌలిక వసతులు
- కాలనీకి పాఠశాల, ఆసుపత్రి, చర్చి, మసీదు మంజూరుకు హామీ
- పోలీస్ ఔట్‌పోస్ట్, బస్సు సౌకర్యం, రేషన్ డీలర్ ఏర్పాటుకు ఆదేశాలు
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు: మంత్రి పొంగులేటి




**జగిత్యాల, ఆగస్టు 21:** రాష్ట్రంలో సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కొత్తగా గృహాలు మంజూరు చేయడంతో పాటు గత ప్రభుత్వాల హయాంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను కూడా పూర్తి చేసి పేదలకు అందిస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌలిక వసతులతో నివాసయోగ్యంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా నూకలపల్లిలో నిర్మించిన అర్బన్ హౌసింగ్ కాలనీలోని గృహ సముదాయాన్ని మంత్రి పరిశీలించారు. లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించి, కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగిత్యాల పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూకలపల్లిలో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 5,400 ఇళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన కోసం ప్రజా ప్రభుత్వం తొలి విడతలో రూ.32 కోట్లు విడుదల చేసిందని పొంగులేటి తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచినట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో మరికొన్ని సదుపాయాలు కల్పించాలన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. పాఠశాల భవనం, ఆసుపత్రి, చర్చి, మసీదు ఏర్పాటుకు రెండు రోజుల్లోనే మంజూరు ఇస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో వెంటనే పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని, రేషన్ డీలర్‌ను నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో ఇంకా మిగిలిపోయిన ఇళ్లను త్వరితగతిన అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న పేద కుటుంబాలకు తప్పకుండా గృహాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందిన ఇద్దరు బాలుర కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహార చెక్కులను మంత్రి అందజేశారు.

## సంపాదకీయం



# ప్రియాంకే బెటర్ ఛాయిస్!

**రాహుల్‌తో పోలిస్తే పరిణతి చెందిన నాయకత్వం**

**పార్లమెంటులో సమస్యలపై సందర్భోచిత స్పందన**

**మోదీ, బీజేపీని ఎదుర్కోవడంలో స్పష్టమైన వైఖరి**

**వందేమాతరం చర్చలో ఆకట్టుకున్న ప్రియాంక**

**విపక్ష నేతగా ముందుకు తెస్తే కాంగ్రెస్‌కు మేలే**

పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తీరును గమనిస్తే ప్రతిపక్షాలు సభను స్తంభింపజేయడం మినహా ప్రజల ముందుకు బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ అజెండాను తీసుకురాలేకపోయాయనే అభిప్రాయం కలుగుతోంది. అయితే ఈ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వ్యవహరించిన తీరు మాత్రం ఆశాజనకంగా కనిపించింది. సభ లోపలా, బయటా అంశాలను ఎంచుకుని సందర్భోచితంగా స్పందించడం, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలకు సమాధానం ఇవ్వడం ద్వారా ఆమె పరిణతి చెందిన నేతగా కనిపించారు. ముఖ్యంగా ప్రధాని మోదీని, బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనే విషయంలో ప్రియాంక అనుసరిస్తున్న పద్ధతి రాహుల్ గాంధీ కంటే భిన్నంగా కనిపిస్తోంది. సమస్యను పట్టుకుని, దానిపై తన వాదనను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం ఆమెలో కనిపిస్తోంది. కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలకు ఆమె మరింత సమర్థంగా దిశానిర్దేశం చేయగలరనే అభిప్రాయానికి ఇదే కారణం. రాహుల్ గాంధీ విమర్శలు ఎక్కువగా మోదీని లక్ష్యంగా చేసుకునే సాగుతున్నాయి. ఓట్ల తొలగింపు, నిరుద్యోగం వంటి అంశాలను ఆయన పదేపదే ప్రస్తావిస్తున్నా.. దేశంలో సామాన్య ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పార్లమెంట్ వేదికగా సమగ్రంగా చర్చకు తీసుకురావడంలో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేయడంతోపాటు వాటికి బలమైన ఆధారాలు, ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపగలిగితేనే విపక్ష నాయకత్వానికి విశ్వసనీయత పెరుగుతుంది. వందేమాతరం అంశంపై జరిగిన చర్చలో ప్రియాంక స్పందించిన తీరు ఇందుకు భిన్నంగా కనిపించింది. ప్రతిసారీ నెహ్రూను లక్ష్యంగా చేసుకోవడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. నెహ్రూపైనే చర్చించాలనుకుంటే ఒకరోజంతా చర్చిద్దామన్న రీతిలో ఎదురుదాడి చేశారు. రాజకీయ విమర్శను రాజకీయంగానే తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ప్రత్యర్థి వాదనలోని బలహీనతలను గుర్తించి స్పందించే సామర్థ్యం ఆమెలో కనిపించింది. అయితే ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థల పనితీరుపై విమర్శలు చేసేటప్పుడు కాంగ్రెస్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల వ్యవస్థలో లోపాలున్నాయని భావిస్తే నిర్దిష్ట ఆధారాలు చూపాలి. అవసరమైన సంస్కరణలను సూచించాలి. ఎన్నికల సంఘం నిర్ణయాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో భాగమే అయినా.. మొత్తం వ్యవస్థపైనే అనుమానాలు కలిగించేలా రాజకీయ విమర్శలు సాగితే ఆశించిన ప్రయోజనం ఉండదు. కాంగ్రెస్ దశాబ్దాల పాటు దేశాన్ని పాలించింది. ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగ సంస్థల బలాలు, బలహీనతలపై ఆ పార్టీకి విస్తృత అనుభవం ఉంది. అందువల్ల అధికార పక్షాన్ని విమర్శించడమే కాకుండా నిర్మాణాత్మక ప్రత్యామ్నాయాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్‌పైనే ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే రాహుల్, ప్రియాంక మధ్య తేడా కనిపిస్తోంది. రాహుల్ రాజకీయ ప్రసంగాలు కొన్ని అంశాల చుట్టూనే తిరుగుతుండగా, ప్రియాంక అంశాన్ని బట్టి తన వాదనను మార్చుకుంటూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆమెకు మరిన్ని కీలక అంశాలపై మాట్లాడే అవకాశం కల్పిస్తే రాజకీయంగా మరింత రాటుదేలే అవకాశముంది. ప్రత్యేకించి డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతాంగం, సమాఖ్య వ్యవస్థ వంటి ప్రజలపై నేరుగా ప్రభావం చూపే అంశాల్లో ప్రియాంకను ముందుకు తీసుకురావడం కాంగ్రెస్‌కు ప్రయోజనకరంగా ఉండొచ్చు. విపక్షం అంటే సభను స్తంభింపజేయడం మాత్రమే కాదు. ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందుంచి సమాధానం రాబట్టడం, ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించడం కూడా దాని బాధ్యత. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు కావాల్సింది కేవలం ప్రభుత్వ వ్యతిరేక నినాదం కాదు.. ప్రజలను ఆకట్టుకునే సమర్థమైన నాయకత్వం. పార్లమెంటులో ఇటీవల ప్రియాంక ప్రదర్శిస్తున్న తీరు చూస్తే ఆ పాత్రకు ఆమెను మరింతగా ఉపయోగించుకోవడం కాంగ్రెస్‌కు మేలు చేయవచ్చు. విపక్ష నాయకత్వంలో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగిస్తే కాంగ్రెస్ రాజకీయాలకు కొత్త దూకుడు వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేం.



# పెల్లెట్ బాధితుడి కోసం రాహుల్ బైఠాయింపు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ డిమాండ్
- బాధితుడు సాహిల్‌తో ఠాణాకు రాహుల్
- కేసు నమోదుకు పోలీసులు నిరాకరించారంటూ నిరసన
- పార్లమెంట్ స్ట్రీట్ ఠాణా ఎదుట బైఠాయింపు
- పెల్లెట్ ప్రయోగించలేదంటున్న పోలీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** పెల్లెట్ గన్ ప్రయోగంలో గాయపడినట్లు ఆరోపిస్తున్న యువకుడికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఢిల్లీలో నిరసనకు దిగారు. బాధితుడిగా చెబుతున్న సాహిల్ లోచాబ్‌ను వెంట తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన.. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదుకు నిరాకరించారంటూ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. 'సంసద్ ఛలో యాత్ర' సందర్భంగా పెల్లెట్ గన్ ప్రయోగంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచాబ్ ఆరోపిస్తున్నారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పలుమార్లు కోరినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాహిల్‌కు మద్దతుగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. తొలుత సాహిల్‌తో కలిసి కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రాహుల్.. న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని తెలియడంతో అక్కడికి చేరుకున్నారు. పెల్లెట్ గన్ ఘటనపై ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు వివరాలను వెల్లడించాలని పోలీసులను కోరారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సంసద్ ఛలో యాత్ర' సందర్భంగా పార్లమెంట్ సమీపంలో విద్యార్థులపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పెల్లెట్ గన్ ప్రయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే పెల్లెట్ గన్ ప్రయోగించారన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో బాధితుడి ఆరోపణలు, కాంగ్రెస్ నిరసనతో ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

**జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రం కోర్టు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21:** హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే

**సుప్రీంకోర్టు కీలక నిర్ణయం**

**సివిల్ జడ్జి పోస్టులకు మూడేళ్ల అనుభవ నిబంధన సవరణ**

**2027 మార్చి వరకు లా గ్రాడ్యుయేట్లకు అనుభవంతో సంబంధం లేకుండా మినహాయింపు**

**న్యూఢిల్లీ:** జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే యువ న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు తీపి కబురు అందించింది. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు గతంలో ఉన్న మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, యువ లా గ్రాడ్యుయేట్లు, మహిళలు, దివ్యాంగులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ సవరణ చేసినట్లు కోర్టు స్పష్టం చేసింది. అభ్యర్థులకు ఊరటనిస్తూ సుప్రీంకోర్టు కొన్ని కీలక మినహాయింపులను ప్రకటించింది. 2025 మే 20 నుండి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేని లా గ్రాడ్యుయేట్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ కాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రైనీ జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులై, ఒక సంవత్సరం స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ శిక్షణతో పాటు మరో సంవత్సరం స్ట్రక్చర్డ్ లా క్లర్క్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే, 2027 ఏప్రిల్ 1 నుండి వచ్చే నోటిఫికేషన్లకు మాత్రం కనీసం ఒక సంవత్సరం యాక్టివ్ ప్రాక్టీస్ అనుభవం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



# డీలిమిటేషన్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు?

- మహిళా రిజర్వేషన్ల అమలుపైనా ఉత్కంఠ
- దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గొద్దంటున్న రాష్ట్రాలు
- ప్రాంతీయ మండలిలో అంశాన్ని ప్రస్తావించిన అమిత్ షా
- రాష్ట్రాల వాటాకు హామీ కోరిన తమిళనాడు
- కేంద్రం తదుపరి అడుగుపై రాజకీయ వర్గాల్లో చర్చ






**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించనుందా? ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఇదే అంశంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. వర్షాకాల సమావేశాల్లోనే దీనిపై కీలక అడుగు పడుతుందన్న అంచనాలు తొలుత వెలువడినా, ఇతర రాజకీయ వివాదాల నేపథ్యంలో డీలిమిటేషన్ అంశం వెనక్కి వెళ్లినట్లు కనిపించింది. అయితే తాజాగా దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో మరోసారి చర్చ మొదలైంది. గురువారం జరిగిన దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. డీలిమిటేషన్‌పై మొదటి నుంచీ దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ చర్చకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధానంగా జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ ప్రాతినిధ్యంలో నష్టం జరగకూడదన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. తమిళనాడు కూడా ఇదే అంశాన్ని కేంద్రం ముందు ఉంచింది. ప్రస్తుతం ఉన్న పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో రాష్ట్రాల వాటా తగ్గకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని, దీనిపై కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరింది. దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత వాటాకు ఎలాంటి నష్టం ఉండదని కేంద్రం హామీ ఇస్తే డీలిమిటేషన్‌పై వ్యతిరేకత కొంత తగ్గే అవకాశం ఉందన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే దీనిపై కేంద్రం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన కార్యాచరణ వెలువడాల్సి ఉంది. మరోవైపు మహిళా రిజర్వేషన్ అమలు కూడా జనగణన, డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపడి ఉండటంతో కేంద్రం తదుపరి అడుగు అత్యంత కీలకంగా మారింది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందన్న ప్రశ్న కూడా రాజకీయ పార్టీల్లో చర్చనీయాంశంగా ఉంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను కేంద్రం నిర్వహిస్తుందా? లేక తదుపరి సాధారణ సమావేశాల్లోనే ముందుకు వెళ్తుందా? అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రత్యేక సమావేశాలపై అధికారిక ప్రకటన వెలువడకపోయినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలు, మహిళా రిజర్వేషన్ల అమలు, భవిష్యత్ లోక్‌సభ స్థానాల సంఖ్య వంటి కీలక అంశాల నేపథ్యంలో కేంద్రం తీసుకునే నిర్ణయం దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారనుంది.

చురకలు

శనివారం 22.08.2026

# ఒక వేడుక.. ఎన్నో చిరునవ్వులు..

- చిన్నారుల విద్యకు 'లయన్స్' భరోసా...
- చిన్నారుల చదువుకు 'లయన్స్' చేయూత... విద్యా సామగ్రి పంపిణీ
- వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ




**నర్సంపేట, ఆగస్టు 21** : వేడుకలను సామాజిక సేవతో ముడిపెట్టి నిర్వహిస్తూ చిన్నారుల విద్యకు ప్రోత్సాహం అందించి లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ సభ్యులు సేవాతత్పరత చాటుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ అధ్యక్షులు లయన్ మోతె ఇంద్రసేనారెడ్డి కుమార్తె, అల్లుడు కాసర్ల శ్రావణి–గౌతమ్ రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని క్లబ్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని నర్సంపేట–4 అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న చిన్నారులకు నోట్‌బుక్కులు, పెన్సిళ్లు, పలకలు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్ మోతె ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించడం వల్ల చిన్నారులు ఐదేళ్లు పూర్తయిన వెంటనే ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు సులభతరం అవుతోందని తెలిపారు. అంగన్‌వాడీ, పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారా పిల్లల విద్యాభివృద్ధికి మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. చిన్నారుల అభివృద్ధి, విద్యాభ్యాసం కోసం అంగన్‌వాడీ టీచర్ నల్లా భారతి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. భవిష్యత్తులోనూ అంగన్‌వాడీ కేంద్రానికి లయన్స్ క్లబ్ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. చిన్నారుల విద్యకు ప్రోత్సాహం అందించడం, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోతె ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి నల్లా సుధాకర్ రెడ్డి, లయన్ హైమావతి, పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు నల్లా భారతి, ఎం.డి. గౌసియా, ఆయా సునీత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వాకర్స్.. అడుగులు ఆగుతున్నాయి..మినీ స్టేడియం మౌన రోదన

- అధికారుల పర్యవేక్షణ కరువు..
- రన్నింగ్ ట్రాక్‌కు దిక్కులేదు.. వెలగని లైట్లు.. పాడైన ఓపెన్ జిమ్
- లక్షలాది రూపాయలతో నిర్మించిన స్టేడియం నిర్లక్ష్యానికి నిలువుటద్దం




**నర్సంపేట, ఆగస్టు 21** : నర్సంపేట పట్టణంలోని మల్లంపెల్లి రోడ్డులో ఉన్న మినీ స్టేడియం నిర్వహణ లోపంతో అధ్వానంగా మారిందని క్రీడాకారులు, వాకర్స్, పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది యువత, క్రీడాకారులు, వాకర్స్, వృద్ధులు వినియోగించే ఈ స్టేడియంలో కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**రన్నింగ్ ట్రాక్ లేక అవస్థలు...**

స్టేడియంలో సరైన రన్నింగ్, వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మైదానమంతా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోవడంతో నడక, పరుగు సాధనకు ఇబ్బందికరంగా మారిందని వారు తెలిపారు.

**వెలగని లైట్లు.. చీకట్లోనే వ్యాయామం...**

స్టేడియంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్, సోలార్ లైట్లు పనిచేయకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేసేందుకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదని వాకర్స్ పేర్కొన్నారు. ముఖ్యంగా చీకటి సమయంలో భద్రతపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**పాడైపోయిన ఓపెన్ జిమ్...**

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు నిర్వహణ లేక తుప్పుపట్టి, కొన్ని పరికరాల భాగాలు ఊడిపోవడంతో వినియోగానికి పనికిరాకుండా పోయాయని తెలిపారు. మరమ్మతులు చేపట్టకపోతే ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**మైదానం అంతా పిచ్చి మొక్కలే...**

స్టేడియంలో పారిశుద్ధ్య, నిర్వహణ చర్యలు సక్రమంగా చేపట్టకపోవడంతో మైదానం పిచ్చి మొక్కలతో నిండిపోయిందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలకు అనువైన వాతావరణం కల్పించాల్సిన మైదానం ప్రస్తుతం నిర్లక్ష్యానికి ప్రతీకగా మారిందని అన్నారు.

**వెంటనే ఆధునీకరించాలని డిమాండ్...**

లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మినీ స్టేడియాన్ని ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం బాధాకరమని పట్టణ వాకర్స్, క్రీడాకారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రన్నింగ్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయడంతో పాటు లైటింగ్ వ్యవస్థను పునరుద్ధరించాలని, ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టి మైదానాన్ని శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. యువత, క్రీడాకారులు, వాకర్స్ ఆరోగ్యానికి ఉపయోగపడేలా మినీ స్టేడియాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పట్టణ వాకర్స్ కోరుతున్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టర్ రాహుల్ శర్మ



**చిట్యాల, ఆగస్టు 21:** అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వార్డులు, ప్రసూతి విభాగం, ఐసీయూ, ల్యాబ్ లను పరిశీలించి రోగులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రాత్రివేళల్లోనూ అందుబాటులో ఉండాలని సూచించారు. రక్తపరీక్షల నివేదికలు త్వరగా అందేలా చర్యలు చేపట్టడంతో పాటు బ్లడ్ బ్యాంక్ కు అవసరమైన పరికరాల ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న అల్ట్రాసౌండ్ మిషన్ ప్రోబ్ సమస్యను పరిష్కరించి యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, పాము, తేలు కాటుకు అవసరమైన మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి పరిశుభ్రత, వైద్య సేవల మెరుగుదలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఖమ్మంలో ఘనంగా ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం

**ఖమ్మం ఆగస్టు21:**
: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA) ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంఘం సహకారంతో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా DLSA కార్యదర్శి పి. దేవి మానస మాట్లాడుతూ, వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాలు, సంక్షేమ పథకాలు, నాల్సా (NALSA) పథకాలపై అవగాహన కల్పించారు. వృద్ధులకు గౌరవప్రదమైన జీవితం, సులభంగా న్యాయం అందుబాటులో ఉండటం, భరణం పొందే హక్కు, వేధింపుల నుంచి రక్షణ కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం, ఉచిత న్యాయ సహాయం, హెల్ప్‌లైన్ సేవలను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని సూచించారు.




# "అరవై ఏళ్లు నిండిన మహిళలు పురుషులు కోసం ప్రత్యేక పథకాలు"..

## లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్ష్మిపతి గౌడ్...

**నారాయణపేట, ఆగస్టు,21,**
జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు నారాయణపేట టౌన్ లోని శశపల్లి గ్రామంలో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం (వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే) సందర్భంగా ఆవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్షి పతి గౌడ్ వృద్ధుల తో మాట్లాడుతూ చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.వృద్ధుల సంరక్షణ మరియు సంక్షేమానికి సంబంధించిన చట్టాలు, పథకాల గురించి అవగాహన కల్పించడం. ముఖ్యంగా, "తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్ల నిర్వహణ మరియు




సంక్షేమ చట్టం, 2007" గురించి వివరించారు .ఈ చట్టం ప్రకారం, పిల్లలు మరియు వారసులు తమ తల్లిదండ్రులకు మరియు సీనియర్ సిటిజన్లకు ఆర్థిక సహాయం అందించడం, వారి బాగోగులు చూడటం వంటివి వారి చట్టబద్ధమైన బాధ్యత. ఈ చట్టం ప్రకారం, పిల్లలు మరియు వారసులు తమ తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్లకు ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా సహాయం అందించడం వారి చట్టబద్ధమైన బాధ్యత. ఈ చట్టం ద్వారా, వృద్ధులు తమ పిల్లల నుండి లేదా వారసుల నుండి సరైన సంరక్షణ మరియు మద్దతు పొందే హక్కును కలిగి ఉంటారు. తల్లిదండ్రులు మరియు వయోవృద్ధ పౌరుల భరణ పోషణ మరియు సంక్షేమమునకుగాను సమర్ధవంతమైన నిబంధన , వృద్ధులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలి. వృద్ధులకు వైద్య, ఆరోగ్య సంరక్షణ మరియు ఇతర సంక్షేమ సేవలను అందించాలి.సమాజంలో ప్రతి ఒక్కరూ వృద్ధులకు సహాయం చేయాలి. సఖి సెంటర్, వోల్డేజ్ హోమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్, సీనియర్ సిటిజన్ల కోసం అన్ని ప్రభుత్వ ప్రయోజనాలు ,పెన్షన్ పథకాలు, పన్ను మినహాయింపులు, బ్యాంక్ FD రేట్లు, ఆరోగ్య బీమా మరియు మరిన్ని ప్రయోజనాలపై అవగాహన మరియు న్యాయపరమైన రక్షణ, ఎస్సీ, ఎస్టీ ,బీసీ మూడు లక్షల ఆదాయం ఉన్నవారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు మీ యొక్క సమస్యలకు 15100 కు ఫోన్ చేయడం వలన మీ యొక్క సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది అని ఫోన్ చేసి తమ సమస్యను చెప్తే ఈ సంస్థలో పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు, అవగాహన కల్పించారు.జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (DLSA) సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయాన్ని ప్రజలు పొందవచ్చు అన్నారు తగిన చట్టాలపై అమలు వంటివి అవగాహన కల్పించారు.

# యువత సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ఆగస్టు21( సమయం న్యూస్ న్యూస్)** ఎన్టీఆర్ చౌక్‌లోని ఉర్దూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్, పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు రీడింగ్ రూమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల హక్కులపై న్యాయ అవగాహన



**హైదరాబాద్, ఆగస్టు 21:** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA), నాంపల్లి కార్యదర్శి పి. అరుణ కుమారి ఆదేశాల మేరకు మల్లేపల్లిలోని జగన్నాథ స్వామి వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎల్ఎస్ఏ ప్యానల్ లాయర్ షాలెం బాబు వృద్ధులకు చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, తల్లిదండ్రులు–వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టం–2007పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్యారా లీగల్ వాలంటీర్లు మజీద్, అబ్దుల్ ఖాదర్, డీఎల్ఎస్ఏ ప్రతినిధి కేశవ రెడ్డి పాల్గొన్నారు.

# రూ.11.80 కోట్లతో ఆరు ప్రభుత్వ కార్యాలయ భవనాలు

## ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**జగిత్యాల, ఆగస్టు 21::** జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, సౌకర్యవంతంగా అందించేందుకు నూతన కార్యాలయ భవనాలు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ధరూర్ క్యాంప్‌లో మొత్తం రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో ఆరు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయాలకు రూ.2.25 కోట్ల చొప్పున, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలకు రూ.2.25 కోట్ల చొప్పున, మాల్యాల, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రూ.1.40 కోట్ల చొప్పున కేటాయించినట్లు తెలిపారు.నూతన భవనాలను ఆధునిక సౌకర్యాలు, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్ట్.. రూ.3.5 కోట్ల మోసాలు




**ఆదిలాబాద్, ఆగస్టు 21:** నేషనల్ ఫెర్టిలైజర్స్ పేరుతో నకిలీ వెబ్‌సైట్ ఏర్పాటు చేసి ఫ్రాంచైజీలు ఇప్పిస్తామని నమ్మిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలను మోసం చేస్తున్న బీహార్‌కు చెందిన ఐదుగురు సైబర్ నేరగాళ్లను ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నిందితులపై దేశవ్యాప్తంగా 498 సైబర్ నేర ఫిర్యాదులు ఉన్నాయని, తెలంగాణలోనే సుమారు 90 ఫిర్యాదులు నమోదయ్యాయని వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు రూ.3.5 కోట్ల మేర మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపారు. జైనథ్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ వ్యక్తికి "National Fertilizers Pvt. Ltd." పేరుతో ఫ్రాంచైజీ ఇప్పిస్తామని నమ్మించి రిజిస్ట్రేషన్, లైసెన్స్ తదితర ఫీజుల పేరుతో రూ.3,85,725 వసూలు చేశారు. ఫిర్యాదు మేరకు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బీహార్‌కు చెందిన ఐదుగురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.

వారి నుంచి 10 మొబైల్ ఫోన్లు, రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకోగా,

## పెద్దపల్లి జిల్లా డీపీఆర్వోగా బి. తిరుమల బాధ్యతలు స్వీకరణ

**పెద్దపల్లి, ఆగస్టు 21:** పెద్దపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిణి (డీపీఆర్వో)గా బి. తిరుమల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను డీపీఆర్వోగా నియమిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బి. తిరుమల జిల్లా కలెక్టర్ శ్రీ హర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆమె శాఖ కార్యకలాపాలు, మీడియా సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఇందిరమ్మ కుట్టు మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల, ఆగస్టు 21:** బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకం కింద 100 శాతం రాయితీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల అర్హులైన మహిళలు TGOBMMS వెబ్‌సైట్‌ద్వారా సెప్టెంబర్ 13లోగా దరఖాస్తు చేసుకోవాలి. వితంతువులు, ఒంటరి, దివ్యాంగ, అనాథ మహిళలు, టైలరింగ్ శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతితో అవసరమైన ధృవపత్రాలను గ్రామీణులు ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణవాసులు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

## నూతన చేయూత పింఛన్లకు ఆగస్టు 31లోగా దరఖాస్తు



**మెదక్, ఆగస్టు 21:** అర్హులైన లబ్ధిదారులు నూతన చేయూత పింఛన్ల కోసం ఆగస్టు 31లోగా మండల లేదా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, 8008556112 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. UDID ధ్రువీకరణ పత్రం లేని దివ్యాంగుల కోసం ఆగస్టు 26న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (GGH)లో ప్రత్యేక UDID శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు.

## చక్కెర ధరల కట్టడికి కేంద్రం చర్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 21::** దేశంలో చక్కెర ధర కిలోకు రూ.48.18 నుంచి రూ.55.70కు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టింది. పండుగల సమయంలో సరఫరా పెంచేందుకు 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసేందుకు అనుమతించింది.ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు డీలర్లకు 400 టన్నుల స్టాక్ పరిమితి విధించగా, సెప్టెంబర్ 1 నుంచి భారీ వినియోగదారులు 15 రోజుల అవసరానికి మించి నిల్వ ఉంచరాదని ఆదేశించింది. అక్టోబర్ 15 నుంచి చెరకు క్రషింగ్ ప్రారంభించాలని రాష్ట్రాలు, మిల్లులకు సూచించింది. ధరల పెరుగుదలకు తక్కువ ఉత్పత్తి, అధిక డిమాండ్, పంట నష్టం, అంతర్జాతీయ సరఫరా తగ్గుదల, అక్రమ నిల్వలు కారణాలని కేంద్రం తెలిపింది.

## ఆగస్టు 24 నుంచి నూతన ఐడీఓసీలో ప్రజావాణి



**ములుగు, ఆగస్టు 20:** ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఆగస్టు 24 నుంచి ములుగు గట్టమ్మ సమీపంలోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఐడీఓసీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎడమవైపు ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఒకేచోట అందుబాటులో ఉన్నందున ప్రజలు ఈ మార్పును గమనించి, తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను ఇకపై నూతన ఐడీఓసీలో అందజేయాలని కలెక్టర్ కోరారు.

## డ్రై డే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య మరియు దోమల నివారణ




**మద్దూర్ మున్సిపల్, ఆగస్టు,21** మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం డ్రై డే – ఫ్రైడే కార్యక్రమంను పారిశుధ్య మరియు దోమల నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్, 2వ వార్డు కౌన్సిలర్ నర్సింహులు, నాయకులు డిల్లికర్ జనార్ధన్, కుడుగుంట నర్సింహులు,ఏఎంసీ చైర్మన్ భీములు,ఉపేందర్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, ప్రజలకు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీ సి. శ్రీకాంత్ మాట్లాడుతూ, మద్దూర్ మున్సిపాలిటీ ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగస్వాములై తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు సహకరించాలని కోరారు.

# కన్నీటి వయసుకు కొండంత అండ..

- వయోవృద్ధుల సంక్షేమమే లక్ష్యం
- తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే.. వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు... డా.అనితా రెడ్డి
- వృద్ధుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించిన డీఎల్ఎస్ఏ, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్
- ఆస్తి కోసం కాదు.. ఆప్యాయత కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు




**హనుమకొండ, ఆగస్టు 21 :** వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ, జడ్జి రామలింగం, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా పరిషత్ కార్యాలయంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి రామలింగం, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి, డీడబ్ల్యూఓ విశ్వజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల కోసం అమలులో ఉన్న చట్టాలు, వారి హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ సేవలపై అవగాహన కల్పించారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ట్రిబ్యునల్ బెంచ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వివిధ వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులు తాము ఒంటరివారమని, తమకు ఎవరూ లేరని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి అండగా నిలిచేందుకు సమాజం, ప్రభుత్వ యంత్రాంగం, న్యాయ సేవా సంస్థలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత కాలంలో వయోవృద్ధులను వేధించడం, నిర్లక్ష్యం చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని, అయితే అనేక సందర్భాల్లో వారు తమ బాధలను బయటకు చెప్పుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల పట్ల కేవలం సానుభూతి చూపించడం కాకుండా సహానుభూతితో స్పందించి, వారికి అవసరమైన సహాయం అందించాలని కోరారు. వేధింపులు, నిర్లక్ష్యం లేదా ఇతర సమస్యలకు గురైన వయోవృద్ధులు సలహా, సహాయం, పునరావాసం కోసం 14567 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు తల్లిదండ్రుల ఆస్తులను పిల్లలకు ముందుగానే బదలాయించడం వల్ల అనంతరం అనేక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం వయోవృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ యుగేందర్, దామోదర్, దేవాచారి, శ్రీనివాస్ రావు, డాక్టర్ ఉష, ఉమతో పాటు పలువురు అధికారులు, న్యాయవాదులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

## నాంపల్లి గుట్టపై సుందరీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్

### ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



**వేములవాడ, ఆగస్టు 21:** వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి గుట్టపై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. నాంపల్లి గుట్టపై పర్యాటక ఆకర్షణగా ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం, దాని ఏర్పాటు పనులతో పాటు ఇతర సుందరీకరణ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కలెక్టర్అ నంతరం నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి, తహసీల్దార్ జయంత్ కుమార్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ గుప్తా జన్మదిన వేడుకలు



**శంషాబాద్ అగస్టు 21:** శంషాబాద్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ గణేష్ గుప్తా జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలో వైభవంగా నిర్వహించారు. పార్టీ నాయకులు స్నేహితులు భారి ఎత్తున ర్యాలీగా తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు జన్మదినం సందర్భంగా పలువురు అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గిరిజన మహిళలు, ఆదివాసి మహిళలు నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. స్నేహితులు కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు అజయ్, ఆయిల్ కుమార్, జహంగీర్ ఖాన్, మాజీ ఎంపిటిసి జ్ఞానేశ్వర్ యాదవ్, నాయకులు మురళి యాదవ్, చేవెళ్ల ప్రసాద్, తోట రాములు, దయానంద్, తెలుగమల యాదయ్య, మాజీ సర్పంచులు దండు ఇస్తారి, శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు కోటేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలి – జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, ఆగస్టు,21** జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు, ఆధార్ అనుసంధానం, ఆఫర్ జనరేషన్ మరియు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నమోదు/అనుసంధానం, ఆఫర్ జనరేషన్ మరియు FLN ప్రగతిని సమీక్షించారు. ప్రతి మండల విద్యాశాఖాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రీ-ప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న ఆధార్ మరియు ఆఫర్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు.వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.అదేవిధంగా, విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని MEOలకు సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి (MEO) ప్రతి నెల తప్పనిసరిగా కనీసం 15 పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, FLN ప్రగతి మరియు ఇతర అకాడమిక్ అంశాలను సమగ్రంగా పరిశీలించాలని,పాఠశాలలను సందర్శించిన సందర్భంగా అకాడమిక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన సూచనలు, సమస్యలు మరియు నిర్దేశించిన చర్యలు తదుపరి సందర్శన సమయంలో అమలు అయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను పరిశీలించి, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## నాంపల్లి గుట్టపై సుందరీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్

- ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



**వేములవాడ, ఆగస్టు 21 :** వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి గుట్టపై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. నాంపల్లి గుట్టపై పర్యాటక ఆకర్షణగా ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం, దాని ఏర్పాటు పనులతో పాటు ఇతర సుందరీకరణ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కలెక్టర్అ నంతరం నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి, తహసీల్దార్ జయంత్ కుమార్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ పెట్టుబడులే లక్ష్యం..

- తెలంగాణ రైజింగ్‌కు భారీ సన్నాహాలు
- డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్' గ్లోబల్ సమ్మిట్
- విదేశీ రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు
- ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులపై దృష్టి
- తెలంగాణ సామర్థ్యాన్ని చాటే రంగాల వారీగా ప్రదర్శనలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 21:** ప్రపంచ పెట్టుబడులను తెలంగాణ వైపు ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు భారీ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్‌లో హైదరాబాద్ వేదికగా జరిగే ఈ అంతర్జాతీయ సదస్సును అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సంజయ్ జాజు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక సంస్థలు, వివిధ రంగాల ప్రముఖులతో పాటు నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని సీఎస్ సూచించారు. ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులను సమ్మిట్‌కు రప్పించేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలన్నారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో పాటు శాస్త్రసాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాలకు చెందిన ప్రముఖులను భాగస్వాములను చేయాలని సూచించారు.

### తెలంగాణ సత్తా ప్రపంచానికి చాటాలి

పరిశ్రమలు, సమాచార సాంకేతికత, జీవశాస్త్రాలు, వైద్యం, విద్య, మౌలిక వసతులు సహా తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సంజయ్ జాజు ఆదేశించారు. ఆయా ప్రదర్శనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

### ప్రత్యేక కమిటీలతో పర్యవేక్షణ

సమ్మిట్ నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూడాలన్నారు. ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమ్మిట్‌కు మార్గదర్శకత్వం అందించేందుకు పరిశ్రమలు, పెట్టుబడులు, సాంకేతికత తదితర రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింత బలంగా ఆవిష్కరించే వేదికగా ఈ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్‌రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# చెప్పాల్సింది చెప్పేశా..

**షోకాజ్‌పై క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చా**

**సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక స్పందిస్తా**

**కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతమేనన్న కొండా సురేఖ**

**హైదరాబాద్, ఆగస్టు 21:** కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసుపై తాను చెప్పాల్సిందంతా చెప్పేశానని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం కొత్తగా చెప్పాల్సిందేమీ లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత మాట్లాడతానని వెల్లడించారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పాను. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. ఈ అంశంపై ప్రస్తుతం మీడియాతో మాట్లాడను. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను" అని కొండా సురేఖ పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నోటీసులపై ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు కొండా సురేఖ లిఖితపూర్వక వివరణ పంపారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని అందులో స్పష్టం చేశారు. కుమార్తె చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలకు తనను రాజకీయంగా బాధ్యురాలిని చేయడం సముచితం కాదని పేర్కొంటూ తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. మరోవైపు సుస్మిత వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కుమార్తె చేసిన విమర్శలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. షోకాజ్ నోటీసుతోనే వ్యవహారాన్ని ముగిస్తారా? లేక క్రమశిక్షణ చర్యల దిశగా ముందుకెళ్తారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# తానెక్కడా కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

**మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ**

**యాదాద్రిభువనగిరి, ఆగస్ట్ 21:** కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తానుచేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# కల్తీకల్లు మాఫియాపై ఉక్కుపాదం

- మూడు రాష్ట్రాలకు విస్తరించిన ఆల్ప్రాజోలం దందా గుట్టురట్టు
- రూ.6 కోట్ల విలువైన అక్రమ ఆస్తుల జప్తు
- 32.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం
- మహారాష్ట్రలో కెమికల్ ఫ్యాక్టరీపై మెరుపుదాడి
- 15 మంది కీలక నిందితులు అదుపులో



**హైదరాబాద్, ఆగస్టు 21:** తెలంగాణలో కల్తీకల్లు తయారీకి ఆల్ప్రాజోలం సరఫరా చేస్తున్న భారీ అంతర్రాష్ట్ర ముఠాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్, బోధన్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు విస్తరించిన నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు అక్రమ వ్యాపారంతో కూడబెట్టిన సుమారు రూ.6 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 15 మంది కీలక నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మాదకద్రవ్యాల వ్యాపారం ద్వారా వచ్చిన సొమ్ముతో సమకూర్చుకున్న ఆస్తులపై ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 68(ఈ) ప్రకారం అధికారులు చర్యలు చేపట్టారు. నిందితులకు చెందిన 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల ప్లాట్లు, అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలతో పాటు మహారాష్ట్రలోని కెమికల్ ఫ్యాక్టరీని జప్తు చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వీటి విలువ రూ.2.5 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

### కల్తీకల్లు ఘటనలతో కదిలిన డొంక

ఉమ్మడి నిజామాబాద్, మెదక్, సిద్ధిపేట జిల్లాల్లో కల్తీకల్లు తయారీకి ఆల్ప్రాజోలం వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నస్రుల్లాబాద్‌లో కల్తీకల్లు తాగి 68 మంది, గాంధారి ప్రాంతంలో మరో 15మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పోలీసులు నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. సిద్ధిపేటలో కల్తీకల్లుకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయి. జహీరాబాద్‌లో నిఘా పెట్టిన అధికారులు 750గ్రాముల ఆల్ప్రాజోలం, 7.50లక్షల నగదు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో లభించిన ఆధారాలతో దర్యాప్తును మరింత విస్తరించారు.

### బోధన్‌లో దొరికిన తీగ.. మహారాష్ట్రలో కదిలిన డొంక

బోధన్ పరిధిలో నిర్వహించిన మెరుపుదాడిలో రూ.25 లక్షల విలువైన 2.5 కిలోల ఆల్ప్రాజోలం, ఒక కారు, రూ.25 లక్షల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ లభించిన కీలక ఆధారాలతో దర్యాప్తు బృందాలు మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చేరుకున్నాయి. అక్కడి 'సూర్యప్రభ ఫార్మా కెమ్' ఫ్యాక్టరీపై దాడి చేసి అక్రమంగా తయారు చేస్తున్న 30 కిలోల ఆల్ప్రాజోలంతో పాటు రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.4 కోట్ల విలువైన కెమికల్ ఫ్యాక్టరీని కూడా అధికారులు జప్తు చేశారు. మొత్తం ఆపరేషన్‌లో 32.5 కిలోల ఆల్ప్రాజోలం పట్టుబడినట్లు వెల్లడించారు.

### ఆస్తులూ వదలం!

మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంతో సంపాదించిన సొమ్ముతో ఆస్తులు కూడబెట్టేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఈగల్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. అక్రమ దందాలో ఎంతటి వారున్నా చట్టం ముందు నిలబెడతామని, డ్రగ్స్ సొమ్ముతో సమకూర్చుకున్న ఆస్తులను గుర్తించి జప్తు చేస్తామని స్పష్టం చేశారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి : మంత్రి సీతక్క వెల్లడి**



**హైదరాబాద్, ఆగస్ట్ 21:** ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సి ఉందని సూచించారు.

# రాష్ట్రంలో ఇల్లు లేని పేద ఉండొద్దు

- అసంపూర్తి గృహాలనూ పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తాం
- నూకలపల్లి 5,400 ఇళ్లకు రూ.32 కోట్లతో మౌలిక వసతులు
- కాలనీకి పాఠశాల, ఆసుపత్రి, చర్చి, మసీదు మంజూరుకు హామీ
- పోలీస్ ఔట్‌పోస్ట్, బస్సు సౌకర్యం, రేషన్ డీలర్ ఏర్పాటుకు ఆదేశాలు
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు: మంత్రి పొంగులేటి




**జగిత్యాల, ఆగస్టు 21:** రాష్ట్రంలో సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కొత్తగా గృహాలు మంజూరు చేయడంతో పాటు గత ప్రభుత్వాల హయాంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను కూడా పూర్తి చేసి పేదలకు అందిస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌలిక వసతులతో నివాసయోగ్యంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా నూకలపల్లిలో నిర్మించిన అర్బన్ హౌసింగ్ కాలనీలోని గృహ సముదాయాన్ని మంత్రి పరిశీలించారు. లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించి, కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగిత్యాల పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూకలపల్లిలో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 5,400 ఇళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన కోసం ప్రజా ప్రభుత్వం తొలి విడతలో రూ.32 కోట్లు విడుదల చేసిందని పొంగులేటి తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచినట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో మరికొన్ని సదుపాయాలు కల్పించాలన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. పాఠశాల భవనం, ఆసుపత్రి, చర్చి, మసీదు ఏర్పాటుకు రెండు రోజుల్లోనే మంజూరు ఇస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో వెంటనే పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని, రేషన్ డీలర్‌ను నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో ఇంకా మిగిలిపోయిన ఇళ్లను త్వరితగతిన అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న పేద కుటుంబాలకు తప్పకుండా గృహాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందిన ఇద్దరు బాలుర కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహార చెక్కులను మంత్రి అందజేశారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**వలిగొండ ఆగస్టు 21** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిర్వహిస్తున్న తనిఖీలలో భాగంగా, తేదీ 21.08.2026 న అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి వేర్వేరుగా కేసులు నమోదు చేసి, సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. మొదటి ఘటనలో, ట్రాక్టర్ నంబర్ TS 30 ATR7662లో మోటకొండూరు నుండి పులిగిల్ల గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ బోడసు ప్రవీణ్, R/o ముత్యాలపల్లి గ్రామం, భువనగిరి మండలం ను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నెం.224/2026 నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండవ ఘటనలో, ట్రాక్టర్ నంబర్ AP20 AR 7704 లో మూసీ నది నుండి సంగెం గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమయంలో పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ షేక్ గౌస్, S/o జహంగీర్‌ను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కూడా కేసు నెం.225/2026 నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకం, అక్రమ రవాణా మరియు అనుమతులు లేకుండా ఇసుకను తరలించే వారిపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుంది మరియు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేసే వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు, సంబంధిత వ్యక్తులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఇరాన్ పై అమెరికా 'అత్యంత కఠిన' ఆంక్షలు

### తీవ్రంగా స్పందించిన టెహ్రాన్

**వాషింగ్టన్/టెహ్రాన్, ఆగస్టు 21:**
ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు అమెరికా సిద్ధమైంది. ఇరాన్‌పై ఇప్పటివరకు అమలు చేసిన వాటికంటే అత్యంత కఠినమైన ఆర్థిక ఆంక్షలను విధించనున్నట్లు అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. కొత్త చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆగస్టు 24న వెల్లడించనున్నట్లు తెలిపారు. ఇరాన్‌కు ఆర్థికంగా సహకరించే దేశాలు, సంస్థలపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అమెరికా హెచ్చరించింది. ముఖ్యంగా ఇరాన్ నుంచి చమురు కొనుగోలు, నగదు బదిలీలు, సముద్ర రవాణా వంటి లావాదేవీలను కొనసాగించే సంస్థలు ద్వితీయ ఆంక్షలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చని సంకేతాలు ఇచ్చింది. ఇరాన్ చమురు వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న చైనా సహకరించాలని కూడా వాషింగ్టన్ కోరుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌కు ఆర్థికంగా ఊతమిచ్చే దేశాలు పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అయితే అమెరికా చర్యలను చైనా వ్యతిరేకిస్తూ, ఆంక్షలు, ఒత్తిడి ద్వారా సమస్య పరిష్కారం కాదని, రాజకీయ–దౌత్య మార్గాల్లో పరిష్కారం కనుగొనాలని పేర్కొంది. అమెరికా హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. కొత్త బెదిరింపులకు తమ స్పందన తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఖలిబాఫ్ అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు దేశం ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ దేశాలతో వాణిజ్యాన్ని పెంచడంతో పాటు అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య ఇప్పటికే తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో తాజా ఆర్థిక ఆంక్షల ప్రకటన అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చర్యలు ఇరాన్ ఆర్థిక వ్యవస్థతో పాటు అంతర్జాతీయ చమురు మార్కెట్లు, ప్రాంతీయ వాణిజ్యంపై కూడా ప్రభావం చూపే అవకాశముందని భావిస్తున్నారు.

## ఆర్కిటిక్ లో రక్షణ బలోపేతం చేసిన నార్వే

**ఓస్లో, ఆగస్టు 21( సమయం న్యూస్** రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఉత్తర ఐరోపాలో భద్రతాపరమైన ఆందోళనలు పెరుగుతున్న వేళ, NATO సభ్యదేశమైన నార్వే ఆర్కిటిక్ ప్రాంతంలో తన సైనిక సామర్థ్యాన్ని భారీగా పెంచుతోంది. ఇటీవల ఏర్పాటు చేసిన ★ఫిన్‌మార్క్ బ్రిగేడ్ (Finnmark Brigade)★ను విస్తరిస్తూ అదనపు ఆయుధ, వైమానిక రక్షణ వ్యవస్థలను సమకూర్చింది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత నార్వే ఏర్పాటు చేసిన తొలి కొత్త బ్రిగేడ్ ఇదే. గత ఏడాది ఏర్పాటైన ఫిన్‌మార్క్ బ్రిగేడ్ దేశంలోని రెండో సైనిక బ్రిగేడ్‌గా ఉంది. రష్యాతో నార్వేకు ఉన్న సుమారు 198 కిలోమీటర్ల సరిహద్దుపై నిఘా, గస్తీ నిర్వహించడం దీని ప్రధాన బాధ్యతల్లో ఒకటి. తాజా విస్తరణలో భాగంగా బ్రిగేడ్‌కు ఆర్టిలరీ బెటాలియన్, ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీ, కమ్యూనికేషన్స్ కంపెనీలను జోడించారు. దీంతో దాదాపు 40 కిలోమీటర్ల దూరంలోని భూభాగ లక్ష్యాలపై దాడి చేయడంతో పాటు నార్వే, NATO యుద్ధ విమానాలు, నౌకలతో సమన్వయంతో సైనిక చర్యలు చేపట్టే సామర్థ్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డికి నివాళులర్పించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 21,** విద్యార్థుల చేతుల్లో దారుణ హత్యకు గురైన ప్రిన్సిపాల్ రూపారెడ్డికి తెలంగాణ గుర్తింపు పొందిన ఆఫర్డబుల్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) గ్రేటర్ కుత్బుల్లాపూర్ కమిటీ ఘనంగా నివాళులర్పించింది. శుక్రవారం సాయంత్రం కుత్బుల్లాపూర్ రంగారెడ్డి నగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఇలాంటి దారుణాలకు పాల్పడటం అత్యంత ఆందోళనకరమన్నారు. ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ, నియంత్రణ లోపించడం కూడా ఇలాంటి ఘటనలకు కారణమవుతోందన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలల్లో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు కూడా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు చెడు మార్గంలో వెళ్తే వారిని మందలించే హక్కు ఉపాధ్యాయులకు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, నేటి సమాజంలో పరిస్థితులు అందుకు భిన్నంగా మారుతున్నాయని, ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించిన సందర్భాల్లో కొంతమంది తల్లిదండ్రులు సైతం ఉపాధ్యాయుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సంఘాల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి, అనుచిత ప్రవర్తన పెరగడం వల్ల విద్యార్థుల్లో ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం తగ్గుతోందన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల గౌరవం పెరిగినప్పుడే విద్యార్థులు క్రమశిక్షణతో, విలువలతో కూడిన ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని రామేశ్వర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయుల స్థాయిని, గౌరవాన్ని పెంచేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేలా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# గురువును గౌరవిద్దాం, సమాజాన్ని కాపాడుకుందాం

- **గురువులు శత్రువులు కాదు..**
- **దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం..**
- **రూపారెడ్డి హత్య దారుణం..మద్దతుగా ప్రైవేట్ టీచర్ల ర్యాలీ..**

**కోస్గి మున్సిపల్, ఆగస్టు,21**

సమాజంలో ఇటీవల కాలంలో ఉపాధ్యాయ వృత్తికి జరుగుతున్న అవమానాలను, దాడులను అరికట్టాలని కోస్గి ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల సంఘము నాయకులు అన్నారు. నల్గొండ జిల్లా కొండమల్లెపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యకు నిరసనగా శుక్రవారం కోస్గి మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో రామాలయం చౌరస్తా నుండి ర్యాలీ చేపట్టి తహశీల్దార్ కల్యాణి,మండల విద్యాధికారి శంకర్ నాయక్,సీఐ సైదులు లకు వినతి పత్రాలు అందించారు. అనంతరం స్థానిక శివాజీ చౌరస్తాలో రూపా రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు శత్రువు కాదని, విద్యార్థి తప్పు చేసినప్పుడు దండించేది కోపంతో కాదు, ప్రేమతోనేనని అన్నారు. క్రమశిక్షణ శిక్ష కాదని సంస్కారం, క్రమశిక్షణ పేరుతో ఉపాధ్యాయుడు ఇచ్చే సూచనలు విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడానికేనని అన్నారు. ఉపాధ్యాయుడు హక్కులు కోల్పోతే సమాజానికి ప్రమాదంగా మరే అవకాశం ఉందని, ఉపాధ్యాయుడు పిల్లవాడి తప్పును సరిదిద్దే హక్కును, క్రమశిక్షణ నేర్పే బాధ్యతను కోల్పోతే, రేపటి సమాజం ఆటవిక సమాజంగా మారిపోయే ప్రమాదం ఉందిని వాపోయారు. తల్లిదండ్రులు ,ఉపాధ్యాయుల మధ్య సహకారం అవసరమని, పిల్లల తప్పులను కప్పిపుచ్చకుండా తలిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ రక్షణ చట్టం తీసుకురావాలని,విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం అవసరం ఉందన్నారు. హత్యకు గురైన రూపారెడ్డి కుటంబాన్ని ప్రభుతం ఆదుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో కోస్గి మండల ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు,ప్రిన్సిపాళ్లు, టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



# బీసీఐ చైర్మన్ రాజీనామా చేయాలి...

- **న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాలి.. ఏకపక్ష నిర్ణయాలకు స్వస్తి పలకాలి**
- **కోర్టు ప్రధాన గేటు ఎదుట న్యాయవాదుల ధర్నా**




**హనుమకొండ, ఆగస్టు 21** : బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా అనుచిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా శుక్రవారం హనుమకొండలోని కోర్టు ప్రధాన గేటు ఎదుట న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ నిరసనలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎల్‌యూ రాష్ట్ర కోశాధికారి ఎన్నంశెట్టి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ న్యాయవాదుల వృత్తి, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా బీసీఐ ప్రజాస్వామిక, స్వతంత్ర, ప్రాతినిధ్య సంస్థగా పనిచేయాల్సి ఉండగా, చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా ఏకపక్ష నిర్ణయాలతో సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఆయన నిర్ణయాల వల్ల న్యాయవాదుల హక్కులు, రక్షణపై ఆందోళన నెలకొందన్నారు. నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థుల విషయంలో చైర్మన్ వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమని పేర్కొంటూ, విద్యార్థులకు క్షమాపణ చెప్పిన వ్యక్తి బీసీఐ చైర్మన్ పదవిలో కొనసాగడం సమంజసం కాదన్నారు. మిశ్రా వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీఐ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి విభిన్న రాజకీయ భావజాలాలు కలిగిన న్యాయవాదులకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉండగా, ఒక రాజకీయ పార్టీ, ఒక భావజాలానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు న్యాయవాదుల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. బీసీఐ పరిధికి సంబంధించిన అంశాలపై మాత్రమే సంస్థ తరఫున అభిప్రాయాలు వ్యక్తం చేయాలని, ఇతర రాజకీయ అంశాల్లో జోక్యం చేసుకోవడం సంస్థ గౌరవాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఐఎల్‌పీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ 1961 న్యాయవాదుల చట్టం కింద ఏర్పడిన బీసీఐ చట్టబద్ధమైన సంస్థగా రాజ్యాంగబద్ధంగా తన విధులను నిర్వర్తించాలని అన్నారు. న్యాయవాదుల హక్కులు, సంక్షేమం, రక్షణ కోసం పనిచేయాల్సిన బీసీఐ చైర్మన్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీసీఐ అన్ని రాజకీయ భావజాలాలకు చెందిన న్యాయవాదులకు సమానంగా ప్రాతినిధ్యం వహించాల్సిన సంస్థ అని, అలాంటి సంస్థకు నాయకత్వం వహించే వ్యక్తి రాజకీయ పక్షపాతాలకు అతీతంగా వ్యవహరించాలని వారు అన్నారు. విద్యార్థుల నిరసనలపై చేసిన వ్యాఖ్యలు కూడా అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొంటూ మనన్ కుమార్ మిశ్రా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మిశ్రా రాజీనామా చేసే వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలను కొనసాగించాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎల్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు సారంపల్లి మధుసూదన్ రెడ్డి, ఐఎల్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు జన్ను పద్మ, జిల్లా నాయకుడు పెండ్యాల అనిల్, జన్ను ప్రభాకర్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రఘుపతి, ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీమనాథం శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి చిరంజీవి, చంద్రమౌళి, మేడారపు రంజిత్, పాము రమేష్, న్యాయవాదులు అబ్దుల్ నబి, ఆనంద్, గంజి రమేష్, గంధం శివ, పూర్ణచందర్, భవాని ప్రసాద్, ప్రభంజన్, పూసపల్లి శ్రీనివాస్, యాకస్వామి, బండి మొగిలి, ఇజ్జగిరి సురేష్, మల్లేష్, విష్ణు వర్ధన్, వేముల రమేష్, బండి హరీష్, గురిమిల్ల రాజు, మర్రి రాజు, బానోత్ విజయ్, మేకల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా క్రీడారంగానికి గేమ్ ఛేంజర్: జ్వాలా గుత్తా

**హైదరాబాద్, ఆగస్టు 21::** కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం (2026–31) దేశ క్రీడారంగంలో కీలక మార్పులు తీసుకురానుందని ఒలింపియన్ జ్వాలా గుత్తా అన్నారు. ఈ పథకానికి రూ.29,054 కోట్లు కేటాయించగా, క్రీడాకారులకు అందించే సహాయాన్ని భారీగా విస్తరించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 33 ఖేలో ఇండియా కేంద్రాల్లో 601 మందికి పైగా క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రంలో 19 గుర్తింపు పొందిన అకాడమీలు పనిచేస్తుండగా, 127 అస్మితా లీగ్‌లలో 20,921 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయి వరకు ప్రతిభను తీర్చిదిద్దడమే పథకం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ ఏడాది చివర్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది.

# సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS**







**వికారాబాద్, ఆగస్టు,21** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ సబ్ డివిజన్ లలో జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడ్డాయి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS DPOలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించి, ఎన్నికల ఏర్పాట్లు మరియు నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం మరియు వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 50 మంది పురుష పోలీస్ సిబ్బందికి ఒక ప్రతినిధిని, 40 మంది మహిళా అభ్యర్థులు కలసి ఒక ప్రతినిధి ని ఎన్నుకుంటారు. అనంతరం ఎన్నికైన ప్రతినిధులందరూ కలిసి జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS; DCRB DSP జనయ్య; DTC DSP శ్రీనివాస్; DSB ఇన్ స్పెక్టర్లు నాగార్జున, జములప్ప; ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## రూపా రెడ్డి హత్యకు నిరసనగా బంద్ చేసిన కరస్పాండెంట్లకు ధన్యవాదాలు

**ట్రస్మా జిల్లా అధ్యక్షులు పాలకూర్ల వెంకటేశంగౌడ్.**



**వలిగొండ ఆగస్టు 21**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దేవరకొండ పరిధిలోని కొండమల్లేపల్లి కి చెందిన ప్రిన్సిపల్ రూపా రెడ్డి హత్యకు నిరసనగా శుక్రవారం బంద్ చేసిన కరస్పాండెంట్ మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపిన ట్రస్మ జిల్లా అధ్యక్షులు పాలకుర్ల వెంకటేశం గౌడ్ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపల్ రూపా రెడ్డి విద్యార్థుల ప్రవర్తన సరిగా లేనందుకు మందలించినందుకు ఆమెను హత్య చేశారు. అసలు సమాజం ఎటువైపు పోతుంది దీనికి బాధ్యత వహించవలసింది ఎవరు ఇప్పటివరకు ప్రభుత్వం గాని మహిళా సంఘాలు స్పందించకపోవడం చాలా బాధాకరం మహిళా ప్రిన్సిపల్ అతి దారుణంగా చంపిన నరరూప రాక్షసులను శిక్షించవలసిన ఎంతైనా ఉంది. ఈ మత్తు పానీయాలకు అలవాటై ఇంకా ఎంతమంది బలై ప్రమాదం ఉంది సభ్య సమాజం ఆలోచించవలసిన అంశం అని అన్నారు.

# ఆగస్టు 31న జరుగు చలో ఇందిరా పార్క్ ను జయప్రదం చేయండి

### ఎండి జహంగీర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు.



**వలిగొండ ఆగస్టు 21 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆగస్టు 31న జరుగు చలో ఇందిరాపార్క్ మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ ప్రజలను కోరారు. శుక్రవారం రోజున మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో జరిగిన సిపిఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల నిధుల సాధన కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక రకాల పోరాటాలు నిర్వహించామని ప్రభుత్వం నిధుల విడుదల విషయంలో చేస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 29,30, 31 తేదీల్లో భువనగిరి నుండి ఇందిరాపార్క్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా 31 వ తేదీన చలో ఇందిరా పార్క్ మహాధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ ఈ మహా ధర్నాకు ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కరువు ప్రాంతంగా ఉన్న జిల్లాలోని సగభాగానికి సాగునీరు అందించే బునాది గాని కాలువ ప్రారంభమై దశాబ్దాలు గడుస్తున్న పాలకులు మారారే తప్ప ప్రజలకు రైతులకు మీరు అందలేకపోయిందని మొద్దు నిద్రలో ఉన్న పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక రకాల పోరాటాలను నిర్వహించడం ద్వారా నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించాలని కానీ అది ప్రకటనలకే పరిమితమైందని నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. అందుకే మొద్దు నిద్రలో ఉన్న పాలకుల మత్తును తొలగించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో భువనగిరి అంబేద్కర్ చౌరస్తా నుండి హైదరాబాద్ ఇందిరా పార్క్ వరకు మూడు రోజులపాటు వందలాదిమందితో పాదయాత్ర నిర్వహించి ఆగస్టు 31వ తేదీన ఇందిరాపార్క్ దగ్గర మహా ధర్నాను నిర్వహిస్తున్నామని ఈ ధర్నాలు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గణపతి రెడ్డి,మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు,మండల కార్యదర్శివర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, శాఖ సహాయ కార్యదర్శి వేముల నాగరాజు,సీనియర్ నాయకులు దొడ్డి బిక్షపతి,వరికుప్పల యాదయ్య,వడ్డేమాన్ వెంకటయ్య, కొమ్మిడి సత్తిరెడ్డి,వనం యాదయ్య,ఈర్ల రమేష్, వడ్డమాని రవి, వరికుప్పల బాబు, వడ్డెమాని మధు,సందెల లింగస్వామి, శ్రీశైలం, వెంకటేశం, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకప్పుడు ఆ సీటు హాట్

- **ఇప్పుడు అక్కడ పని చేయడానికి జంకుతున్న ఉద్యోగులు దీనికి ఆ బాసే కారణమా**

**హైదరాబాద్, ఆగస్టు 21**

నూతనంగా ఏర్పాటైన బల్దియా కార్పొరేషన్లలో ఒక కార్పొరేషన్ లో పనిచేయడానికి పై స్థాయి నుండి కిందిస్థాయి ఉద్యోగుల వరకు జంకుతున్నారు. అత్యధిక ఆదాయాన్నిచ్చే ప్రాంతం కావడంతో అక్కడ పని చేయడానికి సీఎం స్థాయిలో కూడా పైరవీలు చేసేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఆ కార్పొరేషన్ నుంచి ఎంత తొందరగా జారుకుంటే అంత మంచిది అని ఫీలింగ్ లో ఉద్యోగులు ఉన్నారు. దీనికి అసలు కారణం ఆ కార్పొరేషన్ బాస్ వ్యవహార శైలి అని ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఉద్యోగులకు అండగా ఉంటూ వారికి దిశా నిర్దేశం చేస్తూ ప్రజలకు మరింత సులభతరంగా సేవలు అందించే విధంగా పనిచేయాలి. కానీ అలా కాకుండా తాము ఏ తప్పు చేయకున్న తమపై నోటికొచ్చినట్లు అందరి ముందు మాట్లాడడంపై ఉద్యోగులు తీవ్రస్థాయిలో మనస్థాపానికి గురవుతున్నారు. కార్పొరేషన్ లో ఆర్భాటమే ఎక్కువ పని తక్కువ అనే చందంగా తయారయింది అని అంటున్నారు.ఉద్యోగులందరినీ సమన్వయం చేసుకుంటూ పోవడంలో ఆ బాస్ విఫలమయ్యారని ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇదే సందర్భంలో గతంలో పనిచేసిన బాస్ లు ఏ విధంగా ఉండేవారు ఉద్యోగులతో ఎలా పని చేయించారు అనేది కూడా చర్చించుకుంటున్నారు. కార్పొరేషన్ ఏర్పడ్డ నుంచి ఇప్పటివరకు అక్కడ సాధించింది మాత్రం ఏమీ లేదు. ఆ బాస్ పై ఉద్యోగుల నుంచే కాకుండా నిర్మాణదారులు, ప్రజల నుంచి కూడా తీవ్ర విమర్శలే వ్యక్తం అవుతున్నాయి. అధికారులను మీ స్థాయి ఎంత అని విమర్శించే అధికారం ఎవరికి లేదు. ఎంత ఉన్నత పదవిలో ఉన్న ప్రజలు కట్టే పన్నుల తోటే జీతాలు తీసుకుంటున్నాము అనేది మాత్రం ఆ బాస్ మరిచి పోయినట్టు కనబడుతుంది. ఆ కార్పొరేషన్లో తన దగ్గర బంధువును ఒక ఉన్నత స్థాయి పోస్టులో పెట్టడం వెనక మతలబు ఏంటి అంటూ అక్కడి ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఒక పక్క సర్ ప్రక్రియ కొనసాగుతోంది, ఎన్నికల సంఘం ఈ ప్రక్రియలో పాల్గొనే వారిని బదిలీలు చేయొద్దు అంటూ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కానీ ఈ కార్పొరేషన్ లో మాత్రం ఎన్నికల సంఘం ఆదేశాలను బేకాతరు చేస్తూ సర్ ప్రక్రియలో పాల్గొన్న ఉద్యోగులను బదిలీలు చేయడం గమనార్హం.

# సామరస్యంగా జిల్లా పోలీసు అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

### సిబ్బంది సంక్షేమానికి కృషి చేయాలి: ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, ఆగస్టు 21:** ఆదిలాబాద్ జిల్లా పోలీసు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ సమక్షంలో శుక్రవారం సామరస్య పద్ధతిలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారి సంక్షేమానికి అసోసియేషన్ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎస్. అశోక్, ఎ. ఆశన్న, కార్యదర్శిగా ఎం. నైలూ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా ఎల్. విజయ్, కోశాధికారిగా జె. శ్రీకాంత్ ఎన్నికయ్యారు. మరో ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. మౌనిక, డీఎస్పీలు కె. ఇంద్రవర్ధన్, ఎం. వెంకటనర్సయ్యతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్లు, సహాయకులు పోస్టుల అభ్యర్థులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

**గజ్వేల్ ప్రతినిధి, ఆగస్టు 21:** మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, గిరిజన ప్రాంత అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, ఐఓసీ సీ బ్లాక్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా సంక్షేమ అధికారి శారద గజ్వేల్ ఐసిడిఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించి, కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్కు హాజరైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ విద్యార్హత, ఇతర సంబంధిత సర్టిఫికెట్లతో పాటు, ఒక సెట్ జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారి ద్వారా అటెస్టేషన్ చేయించి సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చిరంజీవి, జూనియర్ అసిస్టెంట్ కవిత, బ్లాక్ కో-ఆర్డినేటర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తలకొక్కుల లక్ష్మణ్ జన్మదిన వేడుకలు

- **తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం**
- **మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి రాజమౌళి**




**గజ్వేల్ ప్రతినిధి, ఆగస్టు 21,** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో తలకొక్కుల లక్ష్మణ్ జన్మదిన వేడుకలు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ తలకొక్కుల లక్ష్మణ్ తమ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు, అనంతరం తలకొక్కుల లక్ష్మణ్ కుమారులు దుర్గాప్రసాద్, మధుసూదన్ మాట్లాడుతూ మా నాన్న జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు, పద్మశాలి సంఘం నాయకులు, స్థానిక పుర ప్రముఖులు తలకొక్కుల లక్ష్మణ్ కు శాలువాలు కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భగవంతుడు ఆయనకు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు గాడిపల్లి భాస్కర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు డాక్టర్ కుమారస్వామి, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు దేవదాస్, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు దేవులపల్లి రాజారాం, మాజీ అధ్యక్షులు గాడిపల్లి శ్రీనివాస్, కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి గాడిపల్లి రాజు, యువజన అధ్యక్షులు ప్రేమ్ కుమార్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవు, పద్మశాలి సంఘం కోశాధికారి దేవసాని హనుమందాస్, దేవసాని పోశెట్టి తలకొక్కుల రాజేశం, సురేష్, రమేష్, లయన్ పరమేశ్వర చారి, ఎర్రం శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, మల్లేశం గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్ తలకొక్కుల లక్ష్మణ్ కుటుంబ సభ్యులు, పద్మశాలి సంఘం కుల పెద్దలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు,

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**గజ్వేల్ ప్రతి నిధి, ఆగస్టు 21,** :గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలంలోని ములుగు కమాన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చెందాడు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. చిలసాగర్ రవి (40) కూలీ పనులు చేస్తూ తన వ్యక్తిగత పని నిమిత్తం ములుగు కమాన్ వద్దకు వెళ్లి, అనంతరం బండ నర్సంపల్లి రోడ్డు వైపు నుండి ములుగు కమాన్ వైపుకు రాజీవ్ రహదారిని దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపు నుండి గజ్వేల్ వైపు వెళ్తున్న టీజీ 08 యూ 1189 నంబర్ గల లారీ డ్రైవర్ తన లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ రవిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవి తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు రవికి భార్య లక్ష్మి , ఒక కుమారుడు మహేష్, ఒక కుమార్తె అనూష ఉన్నారు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ములుగు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, ములుగు ఎస్ఐ వి రఘుపతి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ




**గజ్వేల్ ప్రతినిధి, ఆగస్టు 21,** :గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస ప్రాజెక్ట్ ప్రదర్శనలకు మూడు విభాగాల్లో ఎంపికై తమ ప్రతిభను చాటారు. మైక్రోబయాలజీ, గణితశాస్త్రం, చరిత్ర విభాగాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈ రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు తమ ప్రాజెక్టులను విస్తృత వేదికపై ప్రదర్శించే అవకాశం లభించడంతో పాటు, ఇతర కళాశాలల విద్యార్థులతో తమ ఆలోచనలు పంచుకునే అవకాశం, కొత్త విషయాలను తెలుసుకునే విలువైన అనుభవం లభించింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత, ప్రదర్శనా నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదపడింది. రాష్ట్రస్థాయి జిజ్ఞాస ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులకు కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులను రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు సిద్ధం చేయడంలో మైక్రోబయాలజీ విభాగం సూపర్వైజర్ శ్రీ రమణారెడ్డి, గణితశాస్త్ర విభాగం సూపర్వైజర్ డాక్టర్ కె సరోజ, చరిత్ర విభాగం సూపర్వైజర్ డాక్టర్ పి జయరాజు కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహాం రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన సూపర్వైజర్లను శుక్రవారం అభినందించారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

# సాయిబాబా కాలనీలో 60 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

### అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్ ప్రతినిధి, ఆగస్టు 21 :**

ఉప్పల్ డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. పరమేశ్వర్ రెడ్డి అభివృద్ధి పనులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం పరమేశ్వర్ రెడ్డి, సాయిబాబా కాలనీలో విస్తృతంగా పర్యటించారు. రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఉప్పల్ సాయిబాబా కాలనీలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కొత్త స్టామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణం తోపాటు తొందరలోనే సీసీ రోడ్ల పనులు పూర్తి చేస్తామని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి బిక్షపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పిఆర్ సుబ్బారెడ్డి, యుగంధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సునీత నర్సింహారెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, రామచంద్రయ్య, శ్రీకాంత్, నరేష్ గౌడ్, మౌలానా, రామాచారి, ఉపేందర్ యాదవ్, రమణారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, సురేష్, వెంకటేష్, దామోదర్ రెడ్డి, బిక్షంరెడ్డి, అంజిరెడ్డి నరసింహ, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ చేయూత



**చిన్నకోడూరు, ఆగస్టు 21 :**చిన్నకోడూరు మండలం, పెద్దకోడూరు గ్రామానికి చెందిన సుద్దాల పోచయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ శుక్రవారం మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యాన్ని పంపించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పూజల హరికృష్ణ తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న పూజలకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డ్ మెంబర్ నాయిని రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు లహరి, ఏఎంసీ డైరెక్టర్ వినోద్, విజయ్ కుమార్, సలీం, మండల నాయకులు చిరంజీవి, నవీన్, సిద్ధు, వినయ్



# నిజాం పాలనలో తొలి హిందూ కొత్వాల్

## నేడు పాశంవారి వెంకట రామారెడ్డి జయంతి

పింగళి వెంకట రామారెడ్డి. నేటి తరానికి చెందిన చాలా మందికి ఎక్కువగా అపరిచితమైన పేరు. భాగ్యనగరం చిత్రపటంపై చెరగని సంతకం ఆయనది. నిజాం ప్రభువుకు విశ్వాస పాత్రులై, హైదరాబాద్ నగరంపై తనదయిన ముద్ర వేసుకుని, ప్రజలకు అనేక రంగాలలో సహాయ సహకారాలు అందించి ప్రజా శ్రేయస్సే ఏకైక లక్ష్యంగా, అంకిత భావంతో సేవచేసి అపారమైన ప్రేమాభి మానలను చూరగొన్న ప్రజాబంధువు ఆయన. నిజాం రాజుల ఏడు తరాల రాజ్య పాలనలో హైదరాబాదు నగర పోలీసు కమీషనర్ (కొత్వాల్) పదవికి నియమితులైన ప్రప్రథమ హిందువుగా చరిత్రలో మిగిలి పోయారాయన. వెంకట రామారెడ్డి (ఆగష్టు 22, 1869 – జనవరి 25, 1953) నిజాం పరిపాలనలో పోలీసు ఉన్నతాధికారి. నిజాం ప్రభువు వద్ద తమకు గల పలుకుబడి వల్ల ఎన్నో సంస్థలను స్థాపించారు. ఎన్నింటికో సాయం అందించారు. విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. హైదరాబాద్ లో రెడ్డి హాస్టల్ నెలకొల్పారు. ఆయన1869, ఆగష్టు 22 న వనపర్తి జిల్లా కొత్త కొండ మండలం ఒక చిన్న గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు కేశవరావు, జారమ్మ. ఆయన పుట్టగానే కొద్ది సమయం లోనే తల్లి మరణించగా, తొమ్మిది సంవత్సరాల పాటు రాయణి పేటలో అమ్మమ్మ కిష్టమ్మ చెంత పోషణలో పెరిగారు. చిన్నప్పుడు ఖాస్గీ (ప్రైవేటు) బడిలో భారత, భాగవతాలు చదివారు. తరువాత నాలుగు సంవత్సరాలు వనపర్తి పాఠశాలలో ఉర్దూ, ఫార్సీభాషను చదువు కున్నారు. తరువాత విలియం వాహబ్ దగ్గర కన్నడ, మరాఠీ భాషలు నేర్చుకున్నారు. నజర్ మహమ్మద్ సహాయంతో 1886లో ముదిగ్లు ఠాణాకు అమీను (సబ్ ఇన్స్పెక్టర్) గా నియమితులైనారు. తరువాత నిజాం సొంత ఎస్టేటు వ్యవహారాలలో ప్రత్యేక అధికారిగా కొంత కాలం వ్యవహరించారు. నిజాయితీ, సమర్థత, విధుల నిర్వహణలో చాకచక్యం కారణంగా అనతికాలంలో పదోన్నతి లభించింది. మహబూబ్ నగర్, నిజామాబాద్, కరీంనగర్, గుల్బర్గా, అత్రాఫ్ బల్దా (రంగారెడ్డి) జిల్లాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. ఆ తరువాత ఆయన రాజధాని నగరం హైదరాబాద్‌లో నాయెబ్ కొత్వాల్‌గా నియమితులైనారు. అనంతరం కొత్వాల్ (సిటీ పోలీస్ కమిషనర్) అయ్యారు. వేల్సు యువరాజు హైదరాబాదు వచ్చినప్పుడు గట్టి భద్రతా ఏర్పాట్లుచేసి గుర్తింపు పొందారు. 1933 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. వెంకట రామారెడ్డి ఎన్నో సంస్థలను పోషించారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతి గ్రంథాలయం పురోభివృద్ధికి సహాయం అందించారు. 1946లో జరిగిన 26వ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. హైదరాబాదులో రెడ్డి విద్యార్థి వసతి గృహం నెలకొల్పారు. తెలంగాణలో విద్యావ్యాప్తి లోనూ, రాజకీయ చైతన్యం నింపడం లోనూ రెడ్డి హాస్టల్ కీలక పాత్ర పోషించింది. హాస్టల్‌ను ప్రారంభించేందుకు గద్వాల మహారాణి, వనపర్తి రాజా, పింగళి కోదండరాం రెడ్డి, గోపాలు పేట, దోమకొండ రాజా, జటప్రోలు రాజా తదతరుల నుంచి దాదాపు లక్ష రూపాయల వరకు చందాలు పోగు చేశారు. తొలుత నగరంలో అద్దె ఇంట్లో రెడ్డి హాస్టల్‌ను ప్రారంభించారు. తర్వాత 1918లో ప్రస్తుతం అబిడ్స్‌లో ఉన్న రెడ్డి హాస్టల్ సొంత భవనంలోకి మారింది. మాతృభాష పట్ల జరుగుతున్న నిరాదరణను చూడలేక, 26 మే 1943 బుధవారం రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో నాటి ప్రముఖ పండితులు, భాషాభిమానులు, కవులు, రచయితలు సమావేశం నిర్వహించిన ఫలితంగా తెలుగు భాషా సంస్కృతుల ప్రచారం ప్రధాన లక్ష్యంగా ఒక సంస్థను స్థాపించాలని చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సంస్థకు 'నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' అని పేరు పెట్టారు. పరిషత్తు ద్వితీయ మహాసభ ఓరుగల్లులో 1944 డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో వైభవంగా జరగగా, ఉదయ రాజు రాజేశ్వరరావు ఆహ్వాన సంఘానికి అధ్యక్షులు కాగా, కాళోజీ నారాయణరావు కార్యదర్శిగా, మహాసభను రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. 1946 మార్చి 15, 16, 17 తేదీల్లో తృతీయ మహాసభలు జరిగాయి. లోకనంది శంకరనారాయణ రావు సభలకు అధ్యక్షత వహించారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సభలను ప్రారంభించారు. నారాయణ గూడ ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు చాలా కాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయ కార్యవర్గానికి మరణించే వరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1926లో "గోలకొండ పత్రిక" స్థాపనకు ముఖ్య కారకులయ్యారు. ఆ కాలంలో ఆయన వలన సహాయం పొందని తెలుగు సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. హరిజనోద్ధరణకు ఏర్పడిన సంఘాలకు, అనాథ బాలల ఆశ్రమాలు, కుష్టు నివారణ సంఘం జంతు హింసా నివారణ సమితి వంటి సంస్థలతో పనిచేసి, వాటికి ఉదారంగా ధన సహాయం చేశారు. ఈ క్రమంలోనే 1933లో రెడ్డి బాలికల హాస్టల్ (నారాయణ గూడ), 1954లో రెడ్డి మహిళా కళాశాల (నారాయణగూడ) లను ప్రారంభించారు. పింగళి సేవలకు గుర్తింపుగా నిజాం రాజు జన్మదినోత్సవం సందర్భంగా 1921లో "రాజా బహద్దూర్" అనే గౌరవం ఇచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం 1931లో ఆయనకు "ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" గౌరవం ప్రదానం చేశారు. వెంకట రామారెడ్డి కాంస్య విగ్రహం హైదరాబాదులో నారాయణగూడ చౌరస్తాలో ప్రతిష్ఠించారు. వెంకట రామారెడ్డి పేరుతో హైదరాబాద్‌లో ఒక మహిళా కళాశాల స్థాపితమైంది. ఆయన పేరు మీద ట్రస్టును ఏర్పాటుచేసి, ఆ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్, సైబరాబాద్ మూడు కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు విధుల్లో ప్రతిభ కనబర్చిన వారికి రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి అవార్డును అందజేస్తున్నారు. పధ్నాలుగు సంవత్సరాలు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి, గ్రామీణ విద్యార్థుల చదువు కోసం రెడ్డి హాస్టల్ స్థాపించి, ఎందరో తెలుగువారు వెలుగులోకి రావడానికి కారకుడైన మహానుభావుడు కొత్వాల్ వెంకటరామారెడ్డి జనవరి 25 తేదీన 1953 సంవత్సరంలో పరమ పదించారు. లోయర్ ట్యాంక్ బండ్ లోని దోమలగుడ ప్రాంతంలో ఆయన సమాధి ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆదరణ కరువైన తోలుబొమ్మలాట

## నేడు ప్రపంచ జానపద కళల దినోత్సవం



**సినిమాలు, టీవీలు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసి పోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధాన మైనది. తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట.**

ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించ వచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు. మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉ ంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు. ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలిన వారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. రాగం తీయడం, ముక్తాయింపు, సంభాషణ ధోరణిలో స్త్రీగొంతు ముఖ్యపాత్ర వహిస్తుంది. స్త్రీ పాత్రలకు స్త్రీలే పాడతారు తోలు బొమ్మలాటలో సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎండగడతారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపు కథలు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిళ్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. తోలు బొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతం లకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణ వధ, విరాటపర్వం, పద్మవ్యూహం, ఉత్తర గోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు. తోలు బొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలుబొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్ లోని వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి. తోలు బొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్నరూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెపుతారు. తోలుబొమ్మల ఆటలు క్రమేపీ కనుమరుగు కాక తప్పని స్థితి నెలకొంది. తోలు బొమ్మల కళారూపం అంతరించి పోవడానికి గల కారణం నాటకాల ప్రభావం ఉధృతంగా ఉండడం, పద్యనాటకాల ప్రాధాన్యత పెరగడం, నాటకాలలో శాస్త్రీయతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ఉన్నతస్థానం లభించడం, సినిమాలు ప్రజలను సమ్మోహితులను చేయడం, తెరపై ప్రేక్షకులకు కావలసినవి అందించడం, అదేవిధంగా ఇంట్లోనే జనరంజకం అన్న నేపథ్యంలో విస్తృతంగా ఛానల్స్ వచ్చి ప్రపంచ తీరు తెన్నులను మార్చడం వంటి ఎన్నో కారణాలు తోలుబొమ్మలు లాంటి కళారూపాల మనుగడకు సవాలుగా నిలిచాయి. ఇలాంటి విషమ పరిస్థితుల్లో, మన ప్రాచీన కళా రూపాల ఆనవాళ్ళు అని చెప్పడానికి వాటిని బ్రతికించు కోవలసిన అవసరం ఎంతైనా అవసరం.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బ్రిటీషర్లను గడగడలాడించిన విప్లవ జ్యోతి అల్లూరి

## ఆగస్టు 22న రంపచోడవరం ఏజెన్సీలో తిరుగుబాటుకు శ్రీకారం

## 27 ఏళ్ల చిన్న వయసులోనే మన్యం హక్కుల కోసం ప్రాణత్యాగం



విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ధి గాంచిన పోరాట యోధుడు సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మై, చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. 1922 ఆగష్టు 22న మన్యంలో తిరుగు బాటు ప్రారంభం అయింది. రంపచోడవరం ఏజన్సీలోని చింతపల్లి పోలీసు స్టేషనుపై 300 మంది విప్లవ వీరులతో రాజు దాడిచేసి, రికార్డులను చింపివేసి, తుపాకులు, మందుగుండు సామాగ్రిని తీసుకు వెళ్ళారు. మొత్తం 11 తుపాకులు, 5 కత్తులు, 1390 తుపాకీ గుళ్ళు, 14 బాయొనెట్లు తీసుకువెళ్ళారు. ఏమేం తీసుకు వెళ్ళారో రికార్డు పుస్తకంలో రాసి, రాజు సంతకం చేసాడు. అదే ఉత్సాహంతో మరుసటి రోజే శరభన్నపాలెం వెళ్ళి, భోజనాలు చేసి ఆ రాత్రే ఆగష్టు 23న – కృష్ణదేవు పేట పోలీసు స్టేషనును ముట్టడించి, ఆయుధాలను తీసుకు వెళ్ళారు. ముందుగా పోలీసులను భయపెట్టి బయటకు పంపేశారు. 7 తుపాకులు, కొన్ని మందుగుండు పెట్టెలు మాత్రం లభించాయి. ఆగష్టు 24న – వరుసగా మూడవ రోజు – రాజవొమ్మంగి పోలీసు స్టేషనుపై దాడి చేసారు. అయితే ఈసారి పోలీసుల నుండి కొద్దిపాటి ప్రతిఘటన ఎదురైంది. అక్కడ ఆయుధాలు దోచుకోవడమే కాక, అక్కడ బందీగా ఉన్న వీరయ్య దొరను కూడా విడిపించారు. ఈ మూడు దాడులలోను మొత్తం 26 తుపాకులు, 2500కు పైగా మందుగుండు సామాగ్రి వీరికి వశమయ్యాయి. రామరాజు పోరాటంలో అత్యంత సాహసో పేతమైనది అడ్డతీగల పోలీసు స్టేషనుపై అక్టోబర్ 15న జరిపిన దాడి. మొదటి దాడులవలె కాక ముందే సమాచారం ఇచ్చి మరీ చేసిన దాడి ఇది. అక్టోబర్ 19న రంపచోడవరం స్టేషనును పట్టపగలే ముట్టడించారు. 4మాసాల విరామం తర్వాత1923 ఏప్రిల్ 17న రాజు కొద్దిమంది అనుచరులతో అన్నవరంలో ప్రత్యక్షమయ్యాడు. రాజు బృందం స్టేషనుకు వెళ్ళారు. విప్లవకారులు 1923 జూన్ 10న ధారకొండ, కొండకంబేరు మీదుగా మల్కనగిరి వెళ్ళి పోలీసు స్టేషను, ట్రెజరీపై దాడి చేసారు .2-9-1923న రామవరం ప్రాంతానికి కమాండర్‌గా ఉన్న అండర్‌వుడ్ సైనికులకు, మన్యం వీరులకు భీకరమైన పోరాటం జరిగింది. సెప్టెంబర్ లో రాజు ముఖ్య అనుచరుడైన గాము మల్లుదొర పోలీసులకు దొరికి పోయాడు. సెప్టెంబరు 22న విప్లవ కారులు పాడేరు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. అక్టోబరు 26న గూడెం సైనిక స్థావరంపై దాడి చేశారు. మన్యం ప్రజలు ఎన్ని బాధలు పడుతున్నారో వివరించి, వారికి ఈ బాధలనుండి విముక్తి ప్రసాదించడానికి తాను లొంగి పోవాలని నిశ్చయించు కున్నట్లు చెప్పాడు. తనను ప్రభుత్వానికి పట్టి ఇచ్చినవారికి పదివేల రూపాయల బహుమతి లభిస్తుందని, కనుక తనను ప్రభుత్వానికి పట్టి ఇమ్మని కోరాడు. కాని తాను అటువంటి నీచమైన పని చేయ జాలనని మునసబు తిరస్కరించాడు. తరువాత,1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపం నుండి, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రెండో టెస్టుకు లంక కొత్త అస్త్రాలు

## జట్టులోకి మిషారా, ఆరాచ్చిగే

- గాయాలతో ముగ్గురు కీలక ఆటగాళ్లు దూరం
- మెండిస్, నిస్సాంక, చాండిమాల్‌కు విశ్రాంతి
- తొలి టెస్టు ఓటమికి బదులు తీర్చుకోవాలని లంక
- సిరీస్ క్లీన్‌స్వీప్‌పై భారత్ కన్ను



**కొలంబో:** భారత్‌తో జరిగే రెండో టెస్టుకు శ్రీలంక కీలక మార్పులతో సిద్ధమవుతోంది. గాయాలతో పలువురు ప్రధాన ఆటగాళ్లు దూరం కావడంతో దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను జట్టులోకి తీసుకుంది. ఆగస్టు 23 నుంచి కొలంబోలోని సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో రెండో టెస్టు ప్రారంభం కానుంది. తొలి టెస్టులో భారత్ చేతిలో 165 పరుగుల తేడాతో ఓటమిపాలైన శ్రీలంకకు రెండో టెస్టుకు ముందు గాయాలు పెద్ద సమస్యగా మారాయి. కుశాల్ మెండిస్ గాయం కారణంగా దూరం కాగా, పాథుమ్ నిస్సాంక పూర్తిస్థాయిలో కోలుకోలేదు. గాలే టెస్టులో కన్‌కషన్‌కు గురైన దినేశ్ చాండిమాల్ కూడా రెండో టెస్టుకు అందుబాటులో ఉ ండటం లేదు. కీలక బ్యాటర్లు ముగ్గురు దూరం కావడంతో శ్రీలంక బ్యాటింగ్ విభాగంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో దేశవాళీ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. పరిస్థితులను బట్టి వీరిద్దరిలో ఒకరికి లేదా ఇద్దరికీ తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. భారత్ వంటి బలమైన ప్రత్యర్థిపై అవకాశం లభిస్తే తమ ప్రతిభను నిరూపించుకునేందుకు వారికి ఇదో కీలక వేదిక కానుంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. ఇప్పుడు కొలంబోలోనూ అదే జోరు కొనసాగించి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు సొంతగడ్డపై సిరీస్ పరాజయాన్ని తప్పించుకోవాలంటే శ్రీలంకకు రెండో టెస్టులో విజయం తప్పనిసరిగా మారింది. ధనంజయ డి సిల్వా నాయకత్వంలోని శ్రీలంక జట్టులో లహిరు ఉదారా, కమీల్ మిషారా, పసిందు సూరియబండారా, కమిందు మెండిస్, సహన్ ఆరాచ్చిగే, సోనల్ దినూషా, నిరోషన్ డిక్వెల్లా, కేశర నువాన్థా, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అసిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో చోటు దక్కించుకున్నారు. కీలక ఆటగాళు లేకుండానే భారత్‌ను నిలువరించాల్సిన పరిస్థితి రావడంతో కొలంబో టెస్టు శ్రీలంకకు అసలైన పరీక్షగా మారనుంది.

# యూఎస్ ఓపెన్‌లో కనకవర్షం!

- చరిత్రలోనే భారీ ప్రైజ్‌పూల్
- మొత్తం పరిహారం రూ.వెయ్యి కోట్లకు చేరువ
- సింగిల్స్ విజేతకు రూ.52.65 కోట్లు
- ఆగస్టు 23 నుంచి గ్రాండ్‌స్లామ్ సమరం
- అల్కరాజ్ పునరాగమనంపై అందరి చూపు




**న్యూయార్క్:** టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్‌లలో ఒకటైన యూఎస్ ఓపెన్-2026 రికార్డు స్థాయి ప్రైజ్‌మనీతో సరికొత్త చరిత్రకు సిద్ధమైంది. ఈసారి ఆటగాళ్లకు అందించే మొత్తం పరిహారాన్ని 108 మిలియన్ డాలర్లకు పెంచారు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే ఇది భారీ మొత్తంగా నిలవనుంది. 2024తో పోలిస్తే ఏకంగా 44 శాతం పెరుగుదల నమోదైంది. పురుషుల, మహిళల సింగిల్స్ ఛాంపియన్లకు భారీ నజరానా ఎదురుచూస్తోంది. ఒక్కో సింగిల్స్ విజేతకు సుమారు రూ.52.65 కోట్ల నగదు బహుమతి దక్కనుంది. గత ఏడాదితో పోలిస్తే విజేతలకు అందించే ప్రైజ్‌మనీని 10 శాతం పెంచారు. దీంతో టైటిల్‌తో పాటు భారీ చెక్కు కోసం కూడా అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. యునైటెడ్ స్టేట్స్ టెన్నిస్ అసోసియేషన్ ఈ భారీ ప్రైజ్‌మనీ వివరాలను ప్రకటించింది. ఆటగాళ్లపై పెట్టుబడులను మరింత పెంచే దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆటగాళ్లు, అభిమానులు, భాగస్వాములకు యూఎస్ ఓపెన్‌ను మరింత విలువైన వేదికగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. యూఎస్ ఓపెన్ ప్రధాన పోటీలు ఆగస్టు 23న ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 13న పురుషుల సింగిల్స్ ఫైనల్‌తో టోర్నీ ముగియనుంది. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్లు బరిలోకి దిగనుండటంతో టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మరోవైపు స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్‌పైనా అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మణికట్టు గాయం కారణంగా కొంతకాలంగా పోటీ టెన్నిస్‌కు దూరంగా ఉన్న అల్కరాజ్ యూఎస్ ఓపెన్‌తో పునరాగమనం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గాయం నుంచి కోలుకుని అతడు ఏ స్థాయిలో రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. రికార్డు ప్రైజ్‌మనీ.. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్ల పోరు.. టైటిల్ కోసం ఉత్కంఠభరిత సమరం.. ఇలా యూఎస్ ఓపెన్-2026 టెన్నిస్ అభిమానులకు భారీ విందుగా మారనుంది.

# సింధు కథ ముగిసె.. డబుల్స్‌పైనే పతక ఆశలు!






**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ఆరో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగిన సింధు.. మూడో ర్యాంకర్, చైనా షట్లర్ వాంగ్ జి యి చేతిలో హోరాహోరీ పోరులో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో సంచలన విజయంతో అందరి దృష్టిని ఆకర్షించిన యువ షట్లర్ ఆయుష్ శెట్టి కూడా ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిదారి పట్టాడు. దీంతో సింగిల్స్‌లో భారత పోరు ముగిసింది. అయితే మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్-ట్రీసా జాలీ, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్‌కు చేరి పతక ఆశలను సజీవంగా ఉంచారు.

### పోరాడి ఓడిన సింధు

కెరీర్‌లో 11వసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన సింధు.. ప్రిక్వార్టర్స్‌లో వాంగ్ జి యి చేతిలో 11-21, 21-15, 17-21 తేడాతో ఓడిపోయింది. దాదాపు గంటనరపాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను కోల్పోయిన సింధు రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకుంది. నెట్ గేమ్, క్రాస్‌కోర్ట్ స్మాష్‌లతో చెలరేగి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లోనూ సింధు ఒక దశలో 13-10 ఆధిక్యంలో నిలిచింది. అయితే వాంగ్ సుదీర్ఘ ర్యాలీలతో పుంజుకుని 15-15తో స్కోరును సమం చేసింది. కాళ్ల కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ చైనా షట్లర్ పోరాటం కొనసాగించింది. చివరి దశలో సింధు చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్న వాంగ్ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. వాంగ్ చేతిలో సింధుకు ఇది ఆరో ఓటమి.

### ఆయుష్ జోరుకు బ్రేక్

పురుషుల సింగిల్స్‌లో 21 ఏళ్ల ఆయుష్ శెట్టి పోరాటం కూడా ప్రిక్వార్టర్స్‌లో ముగిసింది. తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ షి యుచిని ఓడించి సంచలనం సృష్టించిన ఆయుష్.. ప్రిక్వార్టర్స్‌లో ఇండోనేషియాకు చెందిన అలీః పరాన్ చేతిలో 19-21, 11-21తో వరుస గేమ్‌ల్లో ఓడిపోయాడు. తొలి గేమ్‌లో గట్టిపోటీ ఇచ్చిన ఆయుష్ రెండో గేమ్‌లో మాత్రం ప్రత్యర్థి జోరును అడ్డుకోలేకపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ కూడా నిరాశపరిచింది. చైనాకు చెందిన గువో జిన్‌వా-చెన్ ఫాంగ్‌హుయ్ జోడీ చేతిలో 16-21, 5-21తో ఓటమి పాలైంది.

### సాత్విక్-చిరాగ్ థ్రిల్లింగ్ విక్టరీ

పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఉత్కంఠ పోరులో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఐదో సీడ్ భారత ద్వయం 21-23, 21-19, 21-17తో మలేషియాకు చెందిన జునైదీ ఆరిఫ్-యాప్ రాయ్ కింగ్ జోడీని ఓడించింది. గంటా 22 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌ను తృటిలో చేజార్చుకున్న సాత్విక్-చిరాగ్ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నారు. వరుసగా రెండు గేమ్‌లు గెలిచి క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నారు.

### గాయత్రి-ట్రీసా మరో సంచలనం

మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్-ట్రీసా జాలీ జోడీ సంచలన ప్రదర్శన కొనసాగించింది. ప్రిక్వార్టర్స్‌లో ఏడో ర్యాంక్ జపాన్ జోడీ రిన్ ఇవానాగా-కీ నకానిషిని 21-16, 21-12తో వరుస గేమ్‌ల్లో చిత్తు చేసింది. ఆరంభం నుంచే మ్యాచ్‌పై ఆధిపత్యం చెలాయించిన భారత జోడీ ప్రత్యర్థులకు పుంజుకునే అవకాశమే ఇవ్వలేదు. గాయం నుంచి కోలుకుని తిరిగి వచ్చిన ట్రీసా.. గాయత్రితో కలిసి అద్భుత సమన్వయంతో ఆడింది. ఈ విజయంతో భారత జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లి పతకానికి మరింత చేరువైంది. సింగిల్స్‌లో భారత ఆశలు ముగిసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత పతక ఆశలు ప్రధానంగా గాయత్రి-ట్రీసా, సాత్విక్-చిరాగ్ జోడీలపైనే నిలిచాయి.



# 15 ఏళ్ల నిరీక్షణకు తెర!

## ప్రపంచ బ్యాడ్మింటన్‌లో గాయత్రి-త్రీసా సంచలనం

- నాలుగో సీడ్ చైనా జోడీకి షాక్
- మూడు గేమ్‌ల పోరులో అద్భుత విజయం
- మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం
- జ్వాల-అశ్విని తర్వాత రెండో భారత జోడీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్లు గాయత్రి గోపిచంద్-త్రీసా జాలీ చరిత్ర సృష్టించారు. మహిళల డబుల్స్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్న భారత జోడీ.. నాలుగో సీడ్ చైనా ద్వయాన్ని మట్టికరిపించి పతకాన్ని ఖాయం చేసింది. తద్వారా మహిళల డబుల్స్‌లో భారత్‌కు 15 ఏళ్లుగా కొనసాగుతున్న పతక నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం జరిగిన కీలక పోరులో చైనాకు చెందిన జియా యి ఫాన్-జాంగ్ షు షియాన్ జోడీతో గాయత్రి-త్రీసా అమీతుమీ తేల్చుకున్నారు. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌ను భారత జోడీ 16-21తో కోల్పోయింది. అయితే ఆ తర్వాత ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అద్భుతంగా పుంజుకుంది. రెండో గేమ్‌లో దూకుడు పెంచి 21-15తో చైనా జోడీని చిత్తు చేసి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లో భారత అమ్మాయిల జోరు ముందు చైనా జోడీ నిలువలేకపోయింది. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన గాయత్రి-త్రీసా 21-13తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. నాలుగో సీడ్ జోడీని ఓడించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో భారత మహిళల డబుల్స్ బ్యాడ్మింటన్‌లో గాయత్రి-త్రీసా కొత్త అధ్యాయం లిఖించారు. 2011లో జ్వాలా గుత్తా-అశ్విని పొన్నప్ప జోడీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత మహిళల డబుల్స్‌లో భారత్‌కు మరో పతకం దక్కలేదు. ఇప్పుడు 15 ఏళ్ల తర్వాత గాయత్రి-త్రీసా ఆ నిరీక్షణకు తెరదించారు. అంతకుముందు కూడా భారత జోడీ సంచలన ప్రదర్శన చేసింది. వరుసగా ఉన్నత సీడ్ జోడీలను ఇంటిముఖం పట్టిస్తూ పతక పోరుకు చేరింది. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమిస్తూ గాయత్రి-త్రీసా కనబరిచిన పోరాట పటిమ భారత బ్యాడ్మింటన్‌లో మరో చారిత్రక విజయానికి బాటలు వేసింది.

# ఫిఫా మహిళల ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

- బ్రెజిల్‌లో మహిళల ఫుట్‌బాల్ సమరం
- ఎనిమిది నగరాల్లో 64 మ్యాచ్‌లు
- 2027 జూన్ 24న బ్రెజిల్ తొలి పోరు
- జూలై 25న మరాకానాలో మహా ఫైనల్
- తొలిసారి దక్షిణ అమెరికా గడ్డపై మెగా టోర్నీ

**జ్యూరిచ్:** ఫుట్‌బాల్ అభిమానులకు మరో మహా సమరానికి రంగం సిద్ధమైంది. బ్రెజిల్ వేదికగా జరిగే 2027 ఫిఫా మహిళల ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఫిఫా గురువారం విడుదల చేసింది. దక్షిణ అమెరికా గడ్డపై తొలిసారిగా మహిళల ప్రపంచకప్ జరగనుండటంతో ఈ మెగా టోర్నీపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. బ్రెజిల్‌లోని ఎనిమిది ప్రధాన నగరాల్లో మొత్తం 64 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ఉన్న ఫిఫా ప్రధాన కార్యాలయంలో ప్లేఆఫ్ టోర్నమెంట్ ప్రాథమిక దశ డ్రా సందర్భంగా మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆతిథ్య బ్రెజిల్ తన తొలి మ్యాచ్‌ను జూన్ 24న రియో డి జనీరోలోని ప్రఖ్యాత మరాకానా స్టేడియంలో ఆడనుంది. జూలై 4న బ్రెసిలియాలో బ్రెజిల్ తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. ప్రపంచకప్ మ్యాచ్‌లను బ్రెజిల్‌లోని 8నగరాల్లో నిర్వహించనున్నారు. రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లకు బ్రెసిలియా, పోర్టో అలెగ్రే, రెస్సిఫె, సాల్వడార్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. క్వార్టర్ ఫైనల్ పోరాటాలు బెలో హోరిజోంటే, ఫోర్టలేజాతో పాటు రియో డి జనీరో, సావోపాలో నగరాల్లో జరగనున్నాయి. సావోపాలోలో ఒక సెమీఫైనల్‌తో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. మరో సెమీఫైనల్‌తో పాటు జూలై 25న జరిగే టైటిల్ పోరుకు మరాకానా స్టేడియం వేదిక కానుంది. 2027 మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా మరాకానా స్టేడియం అరుదైన రికార్డును సొంతం చేసుకోనుంది. పురుషుల ప్రపంచకప్ ఫైనల్‌తో పాటు మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు కూడా వేదికైన మూడో స్టేడియంగా నిలవనుంది. గతంలో స్వీడన్‌లోని రసుండా స్టేడియం, అమెరికాలోని రోజ్‌బౌల్ మాత్రమే ఈ ఘనత సాధించాయి. ప్రపంచకప్ జరిగే సమయంలో బ్రెజిల్ వ్యాప్తంగా ఫిఫా అభిమానుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో తెలిపారు. స్టేడియాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా అభిమానులు ప్రపంచకప్ సంబరాలను ఆస్వాదించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.







# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల

లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.



# నటి షావుకారు జానకి మృతి

## వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత.. షావుకారు సినిమాతో పేరు స్థిరం



తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షాపుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# షావుకారు జానకి మృతికి ప్రముఖుల సంతాపం

## చిరంజీవి, ఎన్టీఆర్, విజయ్‌ల సంతాపప్రకటన

**చెన్నై,ఆగస్ట్21 :** ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా షావుకారు జానకికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. షావుకారు జానకి మరణంపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ' ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో దాదాపు ఏడు దశాబ్దాలపాటు కొనసాగింది. వైవిధ్యమైన పాత్రలకు తన సహజమైన నటనతో ప్రాణం పోసి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప నటి ఆమె. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'తెలుగు, భారతీయ సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన షావుకారు జానకి మరణవార్త ఎంతో బాధ కలిగించింది. జానకి సినీ ప్రయాణం, ఆమె పోషించిన పాత్రలు ఎప్పటికీ మన జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్పందిస్తూ.. 'తన అద్వితీయమైన నటనతో ఎన్నో తరాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి అనారోగ్యంతో కన్నుమూశారనే వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి, వేదనకు గురిచేసింది. చిత్ర పరిశ్రమలో 70 ఏళ్లకు పైగా ప్రయాణించి, లెక్కలేనన్ని పాత్రలకు జీవం పోసిన ఆమె కళా సేవ ఎల్లప్పుడూ కొనియాడదగినది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ వంటి వివిధ భాషా చిత్రాలలో నటించి రికార్డు సృష్టించడంతో పాటు.. పద్మశ్రీ, కలైమామణి, నంది అవార్డులతో సహా పలు పురస్కారాలను అందుకున్న షావుకారు జానకి మరణం సినీ రంగానికి తీరని లోటు' అని అన్నారు. మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు స్పందిస్తూ.. 'లెజెండరీ నటి షావుకారు జానకి మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆమె హుందాతనం, గౌరవం, అద్భుతమైన నటనా ప్రస్థానం తరతరాలకూ నిలిచి ఉంటాయి. నేటి యువత ఆమె ఎంతటి గొప్ప మహోన్నతమైన వ్యక్తో తప్పకుండా తెలుసుకోవాలి. ఆమె కుటుంబసభ్యులకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అని రాసుకొచ్చారు.

**CHANGE OF NAME**

**I,MOHAMMED FARHAN, S/O. MOHA MMED OSMAN**,HNO 5-2-107, OSMANPURA, JAGTIAL, MANDAL AND DISTRICT JAGTIAL 505327. SHALL HENCE FORTH BE KNOWN AS **MOHAMMED FARHAN, S/O. MOHAMMED OSMAN,SIRAJ UNISSA BEGUM (MOTHER )** for all purpose.

**CHANGE OF NAME**

**I,MOHAMMED IMRAN , S/O. MOHAMMED OSMAN**,HNO 5-2-109, OSMANPURA,JAGTIAL, MANDAL AND DISTRICT JAGTIAL 505327. SHALL HENCE FORTH BE KNOWN AS **MOHAMMED IMRAN , S/O. MOHAMMED OSMAN,SIRAJ UNISSA BEGUM (MOTHER )** for all purpose

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com